ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

సోమవారం 9 డిసెంబరు 2024



సెల్ఫీ తీసుకుంటూ.. గుర్రపు స్వారీ చేస్తూ..



చిన్నా పెద్దా కేరింతలు



వేటకు సన్నద్ధమవుతున్న మత్స్యకారులు

బీచ్‌లో సరదాగా..

సెలవు రోజుల్లో సరదాగా గడుపుదామని ఎవరికుండదు..? బీచ్‌లకు వెళ్లాలని, బంధువులు, స్నేహితులతో షికారు చేయాలని, సినిమా చూసి, అలా రెస్టారెంట్లలో కొత్తకొత్త వంటలు రుచిచూద్దామని.. ఇలా ఎన్నో ఆలోచనలు చేస్తుంటారు. జిల్లాలో తీర ప్రాంతాలు ఎక్కువగా ఉండడంతో జనమంతా అక్కడికి వెళుతుంటారు.బీచ్‌ల్లో సముద్రపు అలలు పాదాలను తాకుతూ ఆహ్లాదంగా ఉంచడమే కాకుండా,మనసును తేలికగా చేస్తాయి. శాంతంగా ఉండే సముద్ర గాలులకు చిన్నారులు, యువత కేరింతలు కొడుతుంది. సముద్రం మధ్యలో కాసేపు గడపడం.. ఇవన్నీ తీయని గుర్తులు కాక మరేమిటి. ఇలాంటి మరుపురాని అనుభవాలను సొంతం చేసుకునే క్రమంలో మైపాడులో తీరంలో ఆదివారం కనిపించిన దృశ్యాలు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు.



సముద్ర స్నానం చేస్తూ..



రేపు మళ్లీ వస్తానుగా.. అంటూ పడమర దిక్కున వాలుతున్న సూర్యుడు

బరితెగింపు

- ఇరిగేషన్‌శాఖలో అధికారుల లెక్కలేనితనం
- క్యూసీ సర్టిఫికెట్ ట్యాంపరింగ్ చేసిన ఘనులు
- గత ప్రభుత్వంలో దోచుకుతిన్న అక్రమార్కులు
- ప్రభుత్వం మారినా తగ్గని అవినీతి
- ఓ వైపు విజిలెన్స్ విచారణ జరుగుతున్నా జంకని వైనం
- అక్షరసత్యంగా 'ఆంధ్రజ్యోతి' కథనం

వారికి ఉద్యోగమంటే బాధ్యత లేదు... ప్రభుత్వమంటే లెక్కేలేదు.... చివరకు విజిలెన్స్ విచారణ అన్నా.. భయం కూడా లేదు.. ఇది ఇరిగేషన్ శాఖలోని కొంతమంది అధికారుల తీరు... ప్రభుత్వం మారింది కానీ తమ అవినీతి చేష్టలు మాత్రం మారలేదని వారు నిరూపిస్తున్నారు. గత ప్రభుత్వంలో మొదలైన దోపిడీ... కూటమి ప్రభుత్వంలో కూడా కొనసాగుతుండడం గమనార్హం. నాడు పనులు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు పెట్టుకొని తినేశారు. ఇప్పుడు పనులు చేయకుండానే చేసినట్లుగా దొంగ క్వాలిటీ కంట్రోల్(క్యూసీ) సర్టిఫికెట్లతో ప్రజాధనాన్ని దోచుకుంటున్నారు. బుచ్చి సబ్ డివిజన్‌లో వైట్‌నర్‌తో ట్యాంపరింగ్ చేసిన క్యూసీ సర్టిఫికెట్ ఫేక్‌ది అని తేలిపోయింది. దీని ఒరిజినల్ సర్టిఫికెట్ మరో వర్కుకు ఇచ్చినదని క్వాలిటీ అధికారులు స్పష్టం చేశారు. ఇంతటి బరితెగింపునకు పాల్పడిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తిగా మారింది.

నెల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫ్లడ్ డ్యామేజీ రిపేర్స్(ఎఫ్‌డీఆర్) కింద 2021లో సుమారు రూ.232 కోట్ల పనులకు అప్పటి కలెక్టర్ అనుమతులిచ్చారు. అయితే చాలా పనులు అప్పట్లోనే చేసినట్లుగా బిల్లులు పెట్టగా, ఆ బిల్లులన్నీ ఇటీవల మంజూరయ్యాయి. అయితే మూడేళ్ల తర్వాత తాజాగా బుచ్చి సబ్‌డివిజన్ నుంచి కొన్ని బిల్లులు అప్‌లోడ్ అవుతున్నాయి. ఇన్నేళ్ల తర్వాత అప్‌లోడ్ చేయడమే ఒక తప్పయితే, ఆ బిల్లులకు దొంగ క్యూసీ సర్టిఫికెట్‌లు పెట్టడం మరో పెద్ద బాగోతంగా కనిపిస్తోంది. కోవూరు సెక్షన్‌లోని రాజుపాలెం వద్ద బాబూరావు కాలువను బాగు చేసినట్లు రూ.9.99 లక్షల ఎస్టిమేట్ విలువతో ఇటీవల బిల్లు అప్‌లోడ్ చేశారు. అయితే ఈ బిల్లుకు జతచేసిన క్యూసీ సర్టిఫికెట్ ట్యాంపరింగ్ చేసి ఉంది. దీంతో పేఅండ్‌అకౌంట్స్ అధికారి ఈ బిల్లును వెనక్కి పంపారు. ఈ ట్యాంపరింగ్ సర్టిఫికెట్ 'ఆంధ్రజ్యోతి' చేతికి చిక్కగా దీనిపై ఈనెల 5న 'ఎఫ్‌డీఆర్ పనుల్లో కొనసాగుతున్న దోపిడీ' అనే శీర్షికన కథనాన్ని ప్రచురించింది. అయినా ఉన్నతాధికారులెవరూ స్పందించలేదు. అసలు ఎందుకు ఈ క్యూసీ సర్టిఫికెట్‌ను ట్యాంపరింగ్ చేయాల్సి వచ్చిందన్న విషయాన్ని క్వాలిటీ కంట్రోల్ అధికారుల వద్ద ఆరా తీయగా, అసలు బాగోతం వెలుగులోకి వచ్చింది. ఈ నంబర్ కలిగిన క్యూసీ సర్టిఫికెట్‌ను ఒరిజినల్‌గా జారీ చేసింది ఇనమడుగు చానల్ రిపేర్స్ కోసం కాగా, దీని ఎస్టిమేట్ విలువ రూ.6 లక్షలుగా ఉంది. అయితే ఈ వర్కు బిల్లు కూడా ప్రభుత్వం నుంచి మంజూరైనట్లు ఇరిగేషన్ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇక ఆ క్యూసీ సర్టిఫికెట్‌తో పనిలేదు కాబట్టి ఆ సర్టిఫికెట్‌ను ట్యాంపరింగ్ చేసి రాజుపాలెం వద్ద బాబురావు కాలువలో పనులు చేసినట్లుగా చూపించి ప్రజాధనాన్ని దోచేందుకు స్కెచ్ వేసినట్లు అర్థమవుతోంది. ఇంత ధైర్యంగా సర్టిఫికెట్లను ట్యాంపరింగ్ చేసి ప్రజాధనాన్ని కొట్టేయాలని చూస్తున్నారంటే ఇరిగేషన్ శాఖలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



GOVERNMENT OF ANDHRA PRADESH
WATER RESOURCES DEPARTMENT
TGP QC Sub-Division, Kaluvaya
Quality Control Certificate

Serial No.: 398

ఇనమడుగు కాలువ పనులకు ఇచ్చిన ఒరిజినల్ క్యూసీ సర్టిఫికెట్

విజిలెన్స్ విచారణ జరుగుతున్నా..

గత ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖలో భారీ అవినీతి జరిగినట్లు మొదటి నుంచి టీడీపీ నేతలు ఆరోపిస్తూ వస్తున్నారు. పనులు చేయకుండానే చేసినట్లుగా చూపించి బిల్లులు తినేశారన్న ఆరోపణలున్నాయి. రికార్డుల్లో కాలువలు బాగు చేసినట్లు చూపిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం కాలువల దుస్థితి అగమ్యగోచరంగానే ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కాలువలను బాగు చేస్తున్నారు. అయితే గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై పలువురు ఎమ్మెల్యేలు ముఖ్య మంత్రి చంద్ర బాబుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ శాఖలోని అధికారులు, ఉద్యోగులు ఎమ్మెల్యేల వద్దకు పరుగులు తీశారు. నాడు వైసీపీ నేతల ఒత్తిడితో తప్పులు చేయాల్సి వచ్చిందని వివరణ ఇచ్చుకున్నారు. ఇదిలా ఉండగా విజిలెన్స్ విచారణ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే నాడు జరిగిన పనులకు సంబంధించిన రికార్డులన్నీ స్వాధీనం చేసుకుంటున్నారు. ఇలా విజిలెన్స్ విచారణ జరుగుతున్నా, అవినీతికి అలవాటు పడ్డ కొంతమంది అధికారుల తీరులో మాత్రం మార్పు లేదు. ఈ వ్యవహారాలు తెలిసినా ఉన్నతాధికారులు కూడా ఎందుకు మౌనంగా ఉంటున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



GOVERNMENT OF ANDHRA PRADESH
WATER RESOURCES DEPARTMENT
Quality Control Certificate

బాబూరావు కాలువ పనులకు ఇచ్చినట్లుగా చూపిస్తున్న ట్యాంపరింగ్ సర్టిఫికెట్

వివరాలు అడుగుతాం

ఈ వ్యవహారంపై క్వాలిటీ కంట్రోల్ ఈఈ ధనుంజయనాయుడును వివరణ కోరగా ఒరిజినల్‌గా ఈ సర్టిఫికెట్‌ను వేరొక వర్కుకు ఇచ్చినట్లుగా తమ రికార్డుల్లో ఉందని చెప్పారు. దీనిపై సంబంధిత అధికారులను వివరాలు కోరుతామని, అనంతరం చట్ట ప్రకారం చర్యలు చేపడతామని వెల్లడించారు. కాగా ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌ను వివరణ కోరగా ట్యాంపరింగ్ సర్టిఫికెట్‌పై సెంట్రల్ డివిజన్ ఈఈ నుంచి వివరణ తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వారంతా తమ ఇష్టదైవాన్ని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. ఇక తమ కోరికలన్నీ నెరవేరినట్లేనని సంబరపడ్డారు. ఆనందంతో ఇంటిముఖం పట్టారు. బంధువులు, స్నేహితులతో ఫోన్లలో మాట్లాడుకుంటూ వస్తున్నారు. రాత్రి పొద్దుపోవడంతో కొందరు నిద్ర పోయారు.ఒకరిద్దరూ నిద్రమత్తులోనే ఏదో మాట్లాడుతున్నారు. ఇంతలో ఆదివారం వేకువకావడం, ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురికావడం జరిగింది. అప్పటి వరకు వారిలో ఉన్న ఆనందం క్షణాలు ఆవిరైంది. అంతులేని విషాదాన్ని మిగిల్చింది.

ఆనందం.. క్షణాల్లో ఆవిరి

కావలి, సిరిపురంలో విషాదఛాయలు

- పల్నాడు జిల్లాలో రోడ్డు ప్రమాదం
- నలుగురు మృతి, మరో నలుగురికి గాయాలు
- మొక్కులు తీర్చుకుని వస్తుండగా దుర్ఘటన

కావలి రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ మండలం సిరిపురం నుంచి తెలంగాణ రాష్ట్రంలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో మొక్కులు తీర్చుకునేందుకు శుక్రవారం ఉదయం ఎమిమిది మంది కారులో బయలుదేరారు. తిరుగుప్రయాణంలో ఆదివారం తెల్లవారుజామున పల్నాడు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు.ఈ వార్త అటు సిరిపురంలోనూ, ఇటు కావలి వైకుంఠపురంలోనూ విషాదం నింపింది. మొక్కులు తీర్చుకుని ఇంటికి వస్తున్నారని ఎదురుచూస్తున్న వారి కుటుంబసభ్యులకు, పిడుగులాంటి ప్రమాదవార్త విని ఆ షాక్ నుంచి తేరుకోలేకపోయారు. అందరితో కలిసిమెలసి ఉండేవారు ఇక లేరని తెలిసి గ్రామస్థులు కూడా విషాదంలో మునిగిపోయారు. కావలి మండలం సిరిపురం గ్రామానికి చెందిన తుళ్లూరు సురేష్(35), ఆయన భార్య వనిత(32) ఉప్పాల ఏబులు (60), కావలి వైకుంఠపురానికి చెందిన తాతా తిరుపతి(55) ఒకే కుటుంబానికి చెందినవారు కావడం, వారంతా ప్రమాదంలో మృతి చెండడంతో వారి బంధువులు విషాదంలో మునిగారు. తుళ్లూరు సురేష్- వనిత దంపతులకు ఇద్దరు చిన్న పిల్లలు. తల్లితండ్రులను కోల్పోవడంతో వారు అనాథులుగా మిగిలిపోయారు. తల్లి తండ్రులు లేరనే విషయం తెలియని ఆ పిల్లలు వాళ్ల ఎప్పుడు వస్తారోనని ఎదురు చూస్తున్నారు. బేల్దారి పనులు చేసుకుని జీవించే ఏబులు మృతితో ఆకుటుంబం కష్టాల్లో చిక్కుకుంటుంది. కావలిలో ఆటో నడుపుకుని కుటుంబాన్ని పోషిస్తున్న తిరుపతి మృతితో వారి కుటుంబ జీవనం భారంగా మారింది. మృతులంతా కూలినాలి చేసుకుని జీవించేవారు కావటంతో వారి బంధువులు, స్నేహితులను ఓదార్చడం ఎవరితరం కాలేదు.



మృతి చెందిన ఉప్పాల ఏబులు (ఫైల్)



తాతా తిరుపతి (ఫైల్)




తుళ్లూరు వనిత (ఫైల్)



తుళ్లూరు సురేష్ (ఫైల్)

దెబ్బతిన్న రాళ్లపాడు కుడి కాలువ గేటు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు రిజర్వాయరు కుడి కాలువ ప్రధాన గేటు దెబ్బతింది. ఇటీవల కురిసిన వర్షాల సమయంలో కాలువకు నీటి విడుదలను అధికారులు ఆపివేశారు. శనివారం తిరిగి నీరు విడుదలకు ప్రయత్నిస్తున్న సమయంలో ఒకటవ గేటు విరిగి లోపల పడిపో యింది. కుడికాలువ నీటి విడుదల, నిలుపుదలను నియంత్రించేందుకు రెండు గేట్లు ఉంటాయి. వీటిలో మొదటి గేటు ఎత్తే సమయంలో మూడు రౌండ్లు తిప్పాక విరిగి కిందకు పడిపోయింది. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచిన ప్రాజెక్టు అధికారులు, గేట్ల మరమ్మతుల్లో ఎంతో అనుభవం ఉన్న నరసరావుపేటకి చెందిన బాషాను రప్పించి మరమ్మతులకు ప్రయత్నిస్తున్నారు. కొన్నేళ్లుగా ప్రాజెక్టు నిర్వహణ అధ్వానంగా ఉంది. దీంతో కాలువల గేట్లు కానీ, ప్రధాన గేట్ల నిర్వహణ కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ పరి స్థితే నేటి దుస్థితికి కారణమని రైతులు విమర్శిస్తున్నారు. ఈ గేటు హైడ్రా లిక్‌తో సంబంధం తెగిపోయి విరిగి లోపల పడిపోవటంతో దీన్ని బయటకు తీయటం కష్టసాధ్యమని, బయటకు తీసి వెల్డింగ్ చేసి హైడ్రాలిక్‌తో అనుసంధానించి యథావిధిగా లోపలికి దించాల్సి ఉంటుందని మెకానిక్ బాషా తెలిపారు. ఈ క్రమంలో రెండవ గేటుపై నీటివత్తిడి పడకుండా తగు జాగ్రత్తలు కూడా తీసుకోవాల్సి ఉన్నందున కనీసం మూడురోజులు పడుతుందని ఆయన తెలిపారు. కాగా రాళ్లపాడులో నీటిమట్టం 19.11 అడుగులకు చేరటంతో మరో అడుగు నీరు చేరితే గేట్లు ఎత్తి నీటిని మన్నేరుకు విడుదల చేయాల్సి ఉంది.



ఉదయగిరి రూరల్ : అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీన చేసుకున్న పోలీసులు(ఫైల్)

ఊరికో బెల్టు !

- వేలం ద్వారా దుకాణాల కేటాయింపు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
- బరితెగిస్తున్న మద్యం వ్యాపారులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలను మద్యం వ్యాపారులు బేఖాతరు చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే సహించేదిలేదని స్వయానా సీఎం చంద్ర బాబు పదేపదే హెచ్చరిస్తున్నా వారు పట్టించుకోవడంలేదు. తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు గ్రామాల్లో బెల్టుషాపు లను ప్రోత్సహిస్తున్నారు. వేలం ద్వారా వాటిని కేటాయిస్తున్నారు. కొందరు వ్యక్తు లు వేలం పాడి మరీ బెల్టు దుకాణాలను దక్కించుకుంటున్నారు. ఎక్సైజ్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఊరూరా బెల్టు

ఉదయగిరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, మర్రిపాడు, దుత్తలూరు మండలాల్లో 12 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలోని అన్నీ గ్రామాల్లోనూ బెల్టు దుకాణాలు వెలిశాయి. డిమాండ్‌ను బట్టి క్వార్టర్‌పై రూ.40 నుంచి రూ.60ల చొప్పున అదనరంగా వసూలు చేస్తున్నారు. మరికొందరు ద్విచక్ర వాహనంలో మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తున్నారు. కొంతమంది వ్యాపారులు ఇప్పటికే సిండికేట్ కాగా, మరికొంతమంది సిండికేట్ అయ్యేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం బెల్టు దుకాణాలకు వేలం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఉదయగిరి మండలం బండగానిపల్లి పంచాయతీలోని ఓ గ్రామంలో రూ.70 వేలకు ఓ మహిళ వేలం పాడి బెల్టు దుకాణం దక్కించుకున్నట్లు సమాచారం.

దాడులు చేస్తున్నా.. లెక్కేలేదు !

ఎక్సైజ్ అధికారులతోపాటు పోలీసులు బెల్టు దుకాణాలపై దాడులు చేస్తున్నా, నిర్వాహకులు లెక్కచేయడంలేదు. కేసులు నమోదు చేసినా, యథేచ్ఛగా తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ముఖ్యంగా నందిపాడు, కృష్ణంపల్లి, అప్పసముద్రం, గండిపాళెం, నర్రవాడ, పోలంగారిపల్లి, జడదేవి, నందవరం, మర్రిపాడు, ఏరుకొల్లు తదితర గ్రామాల్లో జోరుగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ఇక దుకాణాలు ఉన్న ప్రాంతాలైన ఉదయగిరి, సీతారామపురం, మర్రిపాడు, దుత్తలూరు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచే అనధికారిక మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రత్యేక నిఘా ఉంచి, గ్రామాల్లో బెల్టు దుకాణాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తూనే ఉన్నాం

గ్రామాల్లో బెల్టు షాపులపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తూనే ఉన్నాం. ఇప్పటివరకు సర్కిల్ పరిధిలో 17 కేసులు నమోదు చేశాం. అనధికార మద్యం విక్రయాలపై తనిఖీలు చేస్తున్నాం.

-ఉదయగిరి ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామి

కందుకూరులో విచ్చలవిడిగా దుకాణాలు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బెల్టుదుకాణాలు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. ఒక్కో గ్రామంలో నాలుగైదు బెల్టుషాపులు ఉన్నాయి. మద్యం వ్యాపారులే బెల్టుషాపులకు మద్యం చేరవేసి క్వార్టర్ బాటిల్‌కు రూ. 20 అదనంగా వసూలు చేస్తున్నారు. బెల్టు దుకాణాల నిర్వాహకులు ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ. 50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అయినా ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందం (ఎస్టీఎఫ్) నియోజక వర్గంలో నిర్వహిం చిన తనిఖీల్లో పెద్దఎత్తున బెల్టు దుకాణాలు ఉన్నట్లు గుర్తించడమే కాక, మాచవరం, గుడ్లూరు, పోట్లూరు గ్రామాల్లోని బెల్టుషాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. గుడ్లూరులో ప్రధాన మద్యం దుకాణం సమీపంలోనే బెల్టుషాపు నిర్వహిస్తున్నారు. వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లో బెల్టుషాపుల్లోనే ప్రధానంగా విక్రయాలు చేయిస్తున్నారు. ప్రధాన సెంటర్లలో బహిరంగంగా ఉదయం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తున్నారు. పలుకూరు, కరేడు, సీతారామపురం, ఓగూరు తదితర గ్రామాల్లో బెల్టు దుకాణాల్లోనే రోజూ రూ. 40 వేట నుంచి రూ.50 వేల వ్యాపారం సాగుతున్నట్లు చెబుతున్నారు. మద్యం దుకాణదారులకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. పొరుగునే ఉన్న కొండపి నియోజకవర్గంలో ఒక్క బెల్ట్‌షాపు కూడా లేకపోవడం గమనార్హం.


దుకాణానికి రూ. 1.25 లక్షల వసూలు

ఉన్నతాధికారుల ఆదేశాలతో ఒక్కో దుకాణదారు వద్ద ఎక్సైజ్ అధికారులు ఇటీవల రూ. 1.25 లక్షల వంతున మామూళ్లు వసూళ్లు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మొత్తంలో ఎక్సైజ్ కమిషనర్ ఆఫీసుకు రూ. 10 వేలు, డిప్యూటీ కమిషనర్‌కు రూ. 30వేలు, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు రూ. 30 వేలు, ఏఈఎస్‌కు రూ.15వేలు, స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌కు రూ. 40వేల ప్రాతిపదికన ఈ వసూళ్లు చేశారు.

సెలయేరు.. పర్యాటకుల హుషారు

ఇటీవల కురిసిన వర్షాలకు వెలుగొండ అటవీ ప్రాంతాల్లో సెలయేర్లు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ఉదయగిరి దుర్గంతోపాటు లింగాలదొన క్షేత్రం, ముటిక సిద్దేశ్వరం, భైరవకోన తదితర ప్రాంతాలకు ప్రత్యేక వాహనాల్లో కుటుంబ సభ్యులతో తరలివెళ్లారు. ముటిక సిద్దేశ్వర్యం క్షేత్రానికి వెళ్లే మార్గంలో గల వామిటమ్మ బండ సెలయేటికి భక్తులు పోటెత్తారు. అనంతరం సెలయేటిలో స్నానమాచరించి సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు.

- ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి)



పురాతన భవనాన్ని పరిరక్షించండి

అల్లూరులోని ఇరిగేషన్ బంగ్లా



బ్రిటీష్ పాలకులు మండలకేంద్రంలో నిర్మించిన అతిథి గృహం బంగ్లా ఇది. ప్రస్తుతం దీన్ని ఇరిగేషన్ కార్యాలయంగా వినియోగిస్తున్నారు. కొన్నేళ్ల కిందట నిర్మించిన పురాతన భవనంపై పర్యవేక్షణ కొరవడటంతో నేడు శిథిలావస్థకు చేరుకుంటోంది. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి పురాతన నిర్మాణాలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు చర్చించుకుంటున్నారు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)

కామాక్షితాయి సేవలో రాష్ట్ర జుడిషియరీ డైరెక్టర్



సన్మానం అందుకున్న స్టేట్ జుడిషియరీ డైరెక్టర్

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయాన్ని ఏపీ స్టేట్ జుడిషియరి డైరెక్టర్ అవధానం హరిహరనాథశర్మ ఆదివారం సందర్శించారు. మల్లికార్జున స్వామి, కామాక్షి తాయిలను దర్శించుకున్నారు. అర్చకులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ మురళి ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం గోత్ర నామాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. వేదపండితులు, పురోహితులు ఆశీర్వదించారు. వారి వెంట ఎస్ఐ సంతోష్‌రెడ్డి, ఆలయ సిబ్బంది ఉన్నారు. కాగా మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయం ఆదివారం భక్తులు, నూతన వధూవరులతో కిటకిటలాడింది.

రేషన్ బియ్యం లారీ పట్టివేత

- 172 బస్తాల స్వాధీనం
- డ్రైవర్‌పై కేసు నమోదు



పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న రేషన్ బియ్యం లారీ

కావలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని ఆదివారం ఉదయం గౌరవరం వంతెన సమీపంలో ఎస్ఐ తిరుమల రెడ్డి తమ సిబ్బందితో పట్టుకున్నారు. ఈ సందర్భంగా లారీలోని 172 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఎస్ఐ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారుజామున బియ్యం తరలిస్తున్నట్లు వచ్చిన ఫోన్ సమాచారంను సీఐ రాజేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై ఎస్ఐ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా నెల్లూరు వైపు బియ్యంతో వస్తున్న లారీని అదుపులోకి తీసుకున్నారు. బియ్యం బస్తాలపై వెస్ట్‌గోదావరి జిల్లా భీమవరం అని ట్యాగ్ ఉండటంతో ఆ ప్రాంతం నుంచి రైస్‌మాఫియా బియ్యం తరలించారని తెలుస్తోంది. ఎస్ఐ ఈ విషయంపై డ్రైవర్ కన్నపాటి రామును విచారించారు. తనది ప్రకాశం జిల్లా చీమకుర్తి అని ఒంగోలులో రోడ్డుపై లోడ్ చేసి ఉన్న లారీని తనకు అప్పగించి నెల్లూరుకు తీసుకెళ్లాలని అక్కడకు వెళ్లి ఫోన్ చేస్తే ఆ బియ్యం ఎక్కడ దించాలో చెబుతామని తనను పంపారన్నారు. అంతకుమించి బియ్యం ఎక్కడ ఎత్తారో దాని వెనుక ఎవరు ఉన్నారో తనకు తెలియదన్నారు. దీంతో ఆ బియ్యంను సివిల్‌సప్లయి అధికారులకు అప్పగించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

17 మద్యం సీసాల స్వాధీనం

జలదంకి, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు విక్రయించేందుకు 17మద్యం క్వార్టర్ బాటిళ్లు తీసుకువెళ్తున్న చామదలకు చెందిన వల్లెపు శీనయ్యను ఆదివారం బ్రాహ్మణక్రాక కోనేరు కట్ట సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ లతీఫున్నీసా తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

నాటు తుపాకీ మిస్ ఫైర్ : గిరిజనుడి మృతి

రాపూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాపూరు మండలంలోని పెనుబర్తి గ్రామంలో దురదృష్టకర సంఘటన చోటుచేసుకుంది. శనివారం రాత్రి అడవి పందుల వేటకు వెళ్లిన ముగ్గురు గిరిజనుల్లో శొంఠి మణి ఉపయోగించిన నాటు తుపాకీ మిస్ ఫైర్ కావడంతో తాళ్ల సుధాకర్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని 108 ద్వారా రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధరాత్రి పోలీసుల స్పెషల్ డ్రైవ్

నెల్లూరు(క్రైం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో రపోలీసు అధికారులు జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి 1 గంట వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిం చారు. ఆ వివరాలను ఎస్పీ కృష్ణకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కూడళ్ళ, హైవే ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో పోలీసు అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఓపెన్ డ్రింకింగ్ 24 కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ 16 కేసులు, ఎంవీ యాక్ట్ 175 కేసులు నమోదు చేసి రూ.75,125 అపరాధ రుసుము విధించారు. నిరంతరం వాహన తనిఖీలు కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలు జాతీయ రహదారులపై రాంగ్ రూట్‌లో వెళ్లవద్దని, గమ్యాలకు క్షేమంగా చేరాలని సూచించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	94
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	176
స్కిన్‌లెస్	196
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7328
వెండి కిలో ధర	రూ. 92,800
వెండి ఒక గ్రాము	రూ.95.80

అనుకూలంగా క్రీక్

- ఆశాజనకంగా రొయ్యలసాగు
- ఖర్చులు తగ్గాయని సాగుదారుల హర్షం
- దిగుబడి నాటికి ధరల మాఫియా మోసం చేసేనా.. ఆదాయం చేకూర్చేనా ?
- ప్రతిసారి మోసపోతున్న ఆక్వా రైతులు

అల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఆక్వా రంగం మళ్లీ ఊపందుకుంది. ఇందుకు కారణం క్రీక్ పరిశుభ్రంగా ఉండడమేనని సాగుదారులు అంటున్నారు. ప్రతీఏటా ఈ సమయంలో రొయ్యల గుంటలు ప్రారంభదశలో ఉండేవి. జనవరి నాటికి రొయ్య పిల్లలను వదిలే రైతులు, ఈ ఏడాది ముందుగానే రొయ్యలను వేయడం, క్రీక్ ద్వారా సమస్యలు తలెత్తకపోవడంతో రొయ్యల పెరుగుదలకు వాతావరణం అనుకూలంగా మారింది. దీంతో పెంపకదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన ఖర్చులు

గత ఐదేళ్లుగా ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మేత ధరలు తగ్గుముఖంపట్టాయి. అంతేకాక ఎక్కడా ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగు జరుగుతోంది. దీనికితోడు విద్యుత్ ఖర్చులు, నిర్వహణ ఖర్చులు కూడా తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆసక్తిగా రొయ్యల సాగు చేపట్టారు.

ఆశాజనకంగా ధరలు

జిల్లాలో వెనామీ రకాన్ని అధికంగా సాగు చేస్తారు. ఈ రకం రొయ్య తక్కువ కాలంలో ఎక్కువ ఎదుగుదల కలిగి ఉంటుంది. అయితే ఇటీవల టైగర్ రకం రొయ్యలను కూడా సాగులోకి తీసుకొచ్చే ప్రయత్నాలను చేస్తున్నారు. అయినా వెనామీ రకం పెంపకానికి ఎక్కువమంది ఆసక్తి కనపరుస్తున్నారు. వెనామీ రకం రొయ్యలకు నేడు మార్కెట్లో ఆశాజనకంగా ధరలు ఉన్నాయి. 100 కౌంట్ రూ.260, 30 కౌంట్‌కు రూ.460లు, 40 కౌంట్ రూ.405, 50 కౌంట్ రూ.370, 60 కౌంట్ రూ.340, 70 కౌంట్ రూ.320, 80 కౌంట్ రూ.285, 90 కౌంట్ రూ.270, 100 కౌంట్ రూ.260 పలుకుతుంది. గతంలో చూస్తే 100 కౌంట్ రొయ్యలకు రూ.130 నుంచి రూ.160 వరకు ధరలు కొనసాగాయి. ఇప్పుడు పెరిగిన ధరలతో రైతులు అధికంగా వెనామీ రొయ్యలసాగు చేపట్టారు.



దిగుబడి అయిన వెనామీ రొయ్యలు

దిగుబడి నాటికి మోసం చేసేనా?

ప్రస్తుతం రొయ్యల ధరలు మార్కెట్లో ఆశాజనకంగా ఉన్నాయి.అధిక దిగుబడులు సాధించినపుడు మాఫియా తమ పంజా విసురుతోంది. ఉన్న ధరలను పాతాళానికి దిగజార్చి ఆక్వా రైతులతో ఆడుకుంటున్నది. ఈ దఫా వాతావరణం అనుకూలంగా ఉండడంతో సాగు కూడా ఆశాజనకంగానే ఉంది. దిగుబడి వచ్చే నాటికి రైతులను మాఫియా మోసం చేయనుందా ? ఆదాయం చేకూర్చనుందా..? అనే విషయాన్ని చూడాలని రైతులు అంటున్నారు.

అనుకూలంగా సాగు



ఈసారి ఆక్వా సాగుకు ఎలాంటి ఆటంకాలు లేవు. మేత ధరల నుంచి మందుల వరకు ధరలు కొంతమేర ఊరటనిస్తున్నాయి. దిగుబడి కూడా ఆశాజనకంగా వచ్చే అవకాశం కనిపిస్తోంది. దిగుబడి నాటికి ధరలు ఏ విధంగా ఉంటాయో చూడాలి.

- నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, ఆక్వా రైతు, అల్లూరు

ధరలు ఎలా ఉంటాయో...?



రొయ్యల సాగు ఈ ఏడాది ఆశాజనకంగానే ఉంది. దిగుబడి విషయం అటుంచితే, ధరలు ఎలా ఉంటాయోనని ఆందోళనగా ఉంది. అనేకమార్లు నష్టాలను చవిచూశాం. ఈ ఏడాది అయినా లాభాలను గడించాలని చూస్తున్నాం.

- ఆరుగుంట కిరణ్‌రెడ్డి, ఆక్వా రైతు, అల్లూరు

జొన్నవాడ ఆలయ ఈవోపై విచారణ

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో అక్టోబరు 9, 10 తేదీల్లో కాళరాత్రి పూజలు, 11న నిత్యాన్నదానంలోకి భక్తులను అనుమతించకుండా పంపించేశారంటూ ఓ వ్యక్తి లోకాయుక్త ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో ఆదివారం పెంచలకోన నరసింహస్వామి ఆలయ డీసీ, ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జొన్నవాడ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డిని విచారించారు. ఆలయ నిబంధనలు మేరకు నవరాత్రోత్సవాల్లో రాత్రి 9గంటలకు ఆలయం మూసివేసి తదుపరి కార్యక్రమాలను కేవలం ఉభయదాతలతో పూజలు నిర్వహిస్తారని, ఎవరినీ అవమానించలేదని, ఆలయ నిబంధనల మేరకే పూజలు నిర్వహించినట్లు ఏవీ శ్రీనివాసులురెడ్డి చెప్పారు. అక్టోబరు 9, 10వ తేదీలలో తాను రాత్రి 10గంటల వరకే విధుల్లో ఉన్నానని వివరించారు. అదే విధంగా బయోమెట్రిక్ విధానంతో నిర్వహిస్తున్న అన్నదాన సదనంలో అందుకు విరుద్ధంగా వచ్చిన ఫిర్యాదు దారుడిని నిబంధనల మేరకు సహకరించాలని కోరినట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా ఆలయ నిత్యాన్నదాన సదనానికి ఈ 5నెలల్లో నెలకు రూ.10 లక్షలు వంతున రూ.50లక్షలు బ్యాంకు ఖాతాకు జమచేసినట్లు రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు. ఈ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.

కోహా ఇంటిగ్రేటెడ్ లైబ్రరీ సిస్టం పుస్తకావిష్కరణ

- విట్స్ లైబ్రేరియన్ శేషయ్యకు అరుదైన గుర్తింపు

కావలిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కావలి విట్స్ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ శేషయ్య రచించిన కోహా ఇంటిగ్రేటెడ్ లైబ్రరీ సిస్టమ్ పుస్తకావిష్కరణ ఆదివారం తిరుపతి ఎస్వీ యూనిర్సిటీ ప్రాంగణంలో జరిగింది. ముఖ్య అతిథులుగా ఎస్వీ యూనివర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ద్రవిడ యూనివర్సిటీ వీసీ దొరస్వామి నాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గంథ్రాలయ సంఘం అధ్యక్షుడు కల్యూర్, జాతీయ సదస్సు కార్యదర్శి కొంగర సుదీర్‌బాబు, డెసిడాక్ డైరెక్టర్ నాగేశ్వరరావు, ఇన్‌ఫ్లిబ్‌నెట్ డైరెక్టర్ దేవిక మడల్లిలు శేషయ్యను అభినందించారు.



పుస్తకావిష్కరణలో వీసీలు అప్పారావు, దొరస్వామినాయుడు, శేషయ్య తదితరులు

ఆస్తులు కొల్లగొట్టేందుకే ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

- ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయల విలువైన ఆర్టీసీ ఆస్తులను కొల్లగొట్టేందుకే గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేశాడని కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు, నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి ఆదివారం స్థానిక శోభా కాంప్లెక్సులో బీజేపీ నాయకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రూ.9.37 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని, తన ఐదేళ్లలో దుర్మార్గ పాలన సాగించాడన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల సమస్యలు గాలికొదిలేశాడని, కనీసం పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు డబ్బులు కూడా ఇవ్వ లేదన్నారు. ఆర్టీసీలో చాలా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాధాన్యతా క్రమంలో ఒక్కొక్కటి పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రపంచంలో బీజేపీ అతిపెద్ద రాజకీయ పార్టీ అని, రాష్ట్రంలో అమలయ్యే ప్రతి సంక్షేమ పథకం, అభివృద్ధి పనుల్లో ప్రధాని నరేంద్రమోదీ ఉన్నారన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో బీజేపీ బలంగా ఉందని, రాబోయే రోజుల్లో మన రాష్ట్రంలో కూడా అధికారంలోకి రావడం తథ్యమన్నారు. అనంతరం బీజేపీ నాయకులు, ఆర్టీసీ కార్మికులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్, సర్పంచ్ నెల్లూరు వెంకటస్వామి, బీజేపీ నాయకులు కదిరి వెంకటరంగారావు, ముడమాల రమేష్‌రెడ్డి, పులిచర్ల నారాయణరెడ్డి, గడ్డం ప్రసాద్ నాయుడు, నంబూరి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సోమశిలకు 5,998 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 5,998 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో జలాశయంలో 73.319 టీఎంసీల నీరు నిల్వ ఉండగా దిగువ డెల్టాకు 2,450, కండలేరుకు 1,500, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 150 క్యూసెక్కుల చొప్పున నీరు సరఫరా చేస్తున్నారు.

జనవరి 15 నాటికి వంతెన పూర్తి



వంతెనకోసం భారీ క్రేన్లతో అమర్చుతున్న గడ్డర్లు

మనుబోలు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి 15వ తేదీ నాటికి ఫ్లై ఓవర్ వంతెన పూర్తి చేసేందుకు వేగంగా పనులు చేయిస్తున్నామని జాతీయ రహదారుల సీపీఎం (చీఫ్ ప్లానింగ్ మేనేజర్) గంగాధర్ రెడ్డి తెలిపారు. ఆదివారం కృష్ణపట్నం పోర్టు క్రాస్ రోడ్డు వద్ద భారీ పిల్లర్లపై భారీ క్రేన్‌లతో గడ్డర్లును అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా వంతెన పనులు జరుగుతున్నాయన్నారు. పోర్టు రవాణా వాహనాలకు, హైవేపై వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలు జరగకుండా సుమారు కి.మీ మేరకు వంతెన నిర్మాణం జరుగుతోందన్నారు. వంతెనపై ఆరులైన్ల రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

WANTED

నెల్లూరులోని ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు పనిచేయుటకు 10th Class చదివిన యువకులు కావలెను. జీతం: 14,300+PF రూమ్ ఫ్రీ. సం.ప్ర. సెల్: 91103 39912, 73308 34778

AJR-193833

కావలెను

నెల్లూరు ట్రంకురోడ్డులో మౌర్య లాడ్జ్‌లో పని చేయుటకు బాయ్స్ రిసెప్షనిస్ట్ కావలెను. Qlf: 10th & ఇంటర్. నెల్లూరు టౌన్ పరిసర ప్రాంతాల వారికి ప్రాముఖ్యత. సం.ప్ర. 0861-2306243, 89785 34766

AJR-193693

రియల్ ఎస్టేట్

గుంటూరు జిల్లాలో శ్రీభ్రమరాంబపురం కాలనీ & జనచైతన్య ప్లాట్స్ & UDA అప్రూవ్ ప్లాట్స్ & పొలములు. అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్. మున్నెం లతీష్ గౌడ్. సంప్ర: 9848986831.

AJG-267

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

AUDISANKARA COLLEGE OF EDUCATION

AUDISANKARA

NH-5 ,Bypass Road, Aravind Nagar, GUDUR. Tirupati Dist. (A.P.)

B.Ed., ADMISSIONS NOTIFICATION FOR A & B-CATERGORY SEATS (Management and Spot Admissions)

Applications are invited from the eligible candidates to fill Category-B (Management) and Category-A (Spot Admissions) two year B.Ed., Seats for the Academic year 2024-25.

Counselling Code SANK

Eligibility : BA/ B.Sc / B.com/ BBA/ B.Tech/ PG from any UGC recognized university

Last date for receipt for filled applications and allotments is **10-12-2024.**

Seats will be filled as per the guidelines of the **Convenor APEd.CET 2024 and APSCHE, Guntur**

More Details Contact: 9030010653, 9248748443

- Secretary / Correspondent - PRINCIPAL

బెల్టు దుకాణాలపై దాడులు

కావలి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెలంచర్ల, కొత్తపల్లి గ్రామాల్లోని బెల్టు దుకాణాలపై ఆదివారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు సిబ్బందితో దాడులు నిర్వహించారు. చలంచర్లలో మద్యం అమ్మకాలు చేస్తున్న మొగిలిగుండ్ల కోటేశ్వరరావును అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 11మద్యం సీసాలు, కొత్తపల్లి పాతూరులో చిమ్మిలి మాల్యాద్రి 13మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

- 19 కేంద్రాల్లో 3,566 మంది హాజరు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో బాలాజీరావు

నెల్లూరు(విద్య), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 8వతరగతి విద్యార్థులకు నిర్వహించే జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్‌ఎంఎంఎస్) ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 19 కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించారు. మొత్తం 3,809 మంది దరఖాస్తు చేసుకోగా 3,566 మంది హాజరయ్యారు. 243 మంది గైర్హాజర య్యారు. నెల్లూరులో పరీక్ష తీరును జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్ బాలాజీరావు పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థులకు చదువుకు ఉపకార వేతనం అందిస్తుందని చెప్పారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు 9వతరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతి ఏడాది స్కాలర్‌షిప్ లభిస్తుందన్నారు. జిల్లాలో పరీక్షను ఏలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించామన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌గా రామారావు



నెల్లూరు(విద్య), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎస్ రామారావు నియమితులయ్యారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా పనిచేస్తున్న ఆయన తాత్కాలిక పదోన్నతితో ద్రాక్షారామం పాలిటెక్నిక్ కళా శాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. తాజాగా నెల్లూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులివ్వడంతో ఆదివారం బాధ్యతలు చేపట్టారు. కళాశాల లోని పలు శాఖల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఒళ్లు హూనమే!

- అధ్వానంగా వలేటివారిపాలెం - రామచంద్రాపురం రోడ్డు
- 10గ్రామాల ప్రజలను వెంటాడుతున్న ప్రయాణ కష్టాలు

వలేటివారిపాలెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం నుంచి రామచంద్రాపురానికి వెళ్లే రోడ్డుకు మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని 10గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ రోడ్డులో పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం సాగిస్తే ఒళ్లు హూనం అవడంతో పాటు వాహనాలు కూడా మరమ్మతులకు గురవుతాయని ప్రయాణికులు వాపోతున్నారు.

ఈ రోడ్డులో వెళ్లే గ్రామాలివే..

వలేటివారిపాలెం నుండి లింగపాలెం, అంక భూపాలపురం, రామచంద్రాపురం, ముళ్లవారిపాలెం, చెంచుపాలెం, మాలపాడు, తిమ్మపాలెం, బోగనంపాడు, అగ్రహారం, అలవలపాడు, కనిగిరికి వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి.

పల్లెలు ఎక్కువ ఉండడంతో..

నిత్యం వందల మంది ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం, దుకాణాలకు, ఎక్కువగా పల్లెల నుండి వస్తుం టారు. మాలకొండ పుణ్యక్షేత్రానికి ప్రతి శనివారం వాహనాలలో వందల సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ రోడ్డుపై మోకాటి లోతు గుంతలు ఏర్పడడంతో ప్రయాణం సాగించాలంటే అవస్థలు పడుతున్నారు. రాత్రివేళ్లలో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురిఅవుతున్నారు. తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలతో మరింత అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పాట య్యాక వలేటివారిపాలెం నుండి రామచంద్రాపురం వరకూ ప్యాచ్ పనులు చేపట్టి లేయర్ తారు వేసేందుకు రూ.20లక్షలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారి వివరణ..

పది గ్రామాల పడుతున్న ప్రయాణ ఇబ్బందులపై సంబంధిత పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా నిధులు మంజూరు అయినట్లు చెప్పారు. ఉన్నతాధికారులు అనుమతి ఇస్తే పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.



గుంతలమయంగా రామచంద్రాపురంనకు వెళ్లే రోడ్డు

తరాలకు తెలిసేలా అమరజీవి త్యాగం



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి తదితరులు

- కందుకూరులో పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం ఆవిష్కరణ
- పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దబజారు బండ్లమిట్ట కూడలిలో ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు నూతన విగ్రహాన్ని ఆదివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్‌తో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, యువకులు సొంత నిధులతో విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. అమరజీవి త్యాగం తరతరాలకు తెలిసేలా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి

పథంలో పయనిస్తుందని చెప్పారు. అందుకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. పట్టణ ఆర్యవైశ్యులకు తమ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. అంతకుముందు ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు వారికి ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరక్టర్ తటవర్తి వాసు, ఆర్యవైశ్య ప్రముఖులు దర్శి హరికృష్ణ, పల్లపోతు వెంకటేశ్వర్లు, కోట హనుమంతరావు, స్థానిక పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నెరోశయ్య, మాదాల లక్ష్మీ నరసింహ్మం పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో ఎంపీ వేమిరెడ్డి

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తొలిసారిగా టీడీపీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా నేతలు నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై వినతులు అందజేశారు. బీజేపీ నేతలు గట్టమనేని హరిబాబు, ముప్వల భూషయ్య, వరప్రసాదు ఎంపీని కలిశారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కందుకూరు బైపాస్‌లో గుడ్లూరు రోడ్డు క్రాస్ వద్ద అండర్‌పాస్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు.

న్యూస్ బాక్స్

రేపు పెన్షనర్లకు క్రీడా పోటీలు

కావలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర పెన్షనర్ల సంఘం కావలి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఉదయగిరి రోడ్డు మినీ స్టేడియంలో మంగళవారం ఉదయం పెన్షనర్లకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే సాయంత్రం పెన్షనర్స్ భవనంలో ఇండోర్‌గేమ్స్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీ జరుగనున్న ఆలిండియా పెన్షనర్స్ డేను పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సైడు కాలువలు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

లింగసముద్రం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా సైడు కాలువల నిర్మాణం చేపట్టాలని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవకి శేషగిరిరావు, టీడీపీ నాయకులు దేవకి సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు ఆర్యవైశ్యులు ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. వీరు కందుకూరులోని ఎమ్మెల్యే చాంబర్‌లో కలిసి మాట్లాడారు. లింగసముద్రం బస్టాండ్ సెంటర్‌లో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా సైడు కాలువలు లేక వర్షం కురిసిన ప్రతిసారీ నీరు ఇళ్లలోకి వస్తున్నట్లు తెలిపారు.

సేవలను ప్రోత్సహించాలి



సన్మాన గ్రహీతలతో బిట్రగుంట వాకర్స్

బిట్రగుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజసేవ చేసే వారిని ప్రోత్స హించడం మంచి ఆచారం అని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.స్పర్జన్‌రాజ్, గౌరవాధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో బిట్రగుంట రైల్వే మాజీ చీఫ్ పరసనల్ ఆఫీసర్ గోవిందరాజులు, స్టేషన్ మాస్టర్ మద్దిబోయిన రాఘవప్రసాద్, వాకర్స్ మాజీ ఉపాధ్యక్షుడు మన్నెం శ్రీనివాసులును వాకర్స్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు చంద్రశేఖర్, వాకర్స్ ఫౌండర్ అధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యులు జిల్లానిబాషా, జీవన్‌కుమార్, సత్యనారాయణ చార్యులు ఉన్నారు.

రాయితీపై విత్తనాలివ్వాలి

బిట్రగుంట, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): బోగోలు మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి నారుమడుల రైతులకు నూరుశాతం రాయితీతో విత్తనాలు అందచేయాలని వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు ఆదివారం డిమాండ్ చేశారు. భారీ వర్షాలు, తుఫాన్ దెబ్బకు చిన్న సన్నకారు రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయారని చెప్పారు.

బీసీ వసతిగృహం తనిఖీ



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రత్యేకాధికారి

అనంతసాగరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన అనంతసాగరంలోని బీసీ బాలుర వసతిగృహాన్ని జిల్లా స్పెషల్ ఆఫీసర్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ హాజరును పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, లేదా అనే అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉదయగిరికి రాత్రి బస్సు సౌకర్యం కల్పించాలి



సన్నపురెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డేగ మధుయాదవ్

వింజమూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కావలి నుంచి ఉదయగిరికి రాత్రి బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి 8మండలాల అధ్యక్షులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయగిరి పట్టణంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయనకు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వింజమూరు మండల అధ్యక్షుడు డేగ మధుయాదవ్ పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని బీఎంసీసీ చర్చిలో ఆదివారం క్రిస్మస్ ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సుధీర్‌కుమార్ బైబిల్‌లోని సందేశాలు అందించారు.

కావలిలో జబర్దస్త్ టీం సందడి



ఎమ్మెల్యే కుటుంబంతో జబర్దస్త్ టీమ్ సభ్యులు

కావలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామిరెడ్డితోట కల్యాణ మండపంలో రెడ్డిసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆత్మీయసమ్మేళనంలో జబర్దస్త్ టీం సభ్యులు హైపర్ ఆది, రైజింగ్ రాజు, బుల్లెట్ బాస్కర్, శాంతి, నరేష్, దొరబాబు సందడి చేశారు. అంతకుముందు వారు ముసునూరులోని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి నివాసానికి వచ్చి అల్పాహారం తీసుకున్నారు. ఆ సమయంలో ఎమ్మెల్యే ఇంటి వద్ద ఉన్న ప్రజలు వారితో కలిసి ఫొటోలు దిగటంతో అక్కడ సందడి నెలకొంది.

రేపు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ కరీమున్నీసా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ అధికారుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, ఆత్మకూరు ప్రాంత ప్రయాణికులు, ప్రజలు తమ సూచనలు, సలహాలు ఫిర్యాదుల సెల్ నెంబరు 9959225645కు తెలియజేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక 33కేవీ సబ్‌స్టేషన్ నుంచి గుడ్లూరు ఫీడర్‌కు వెళ్లే ప్రధాన లైనుకు తగులుతున్న చెట్లు కొమ్మలు తొలగించేందుకు ఆ ఫీడర్ పరిధిలోని సబ్ స్టేషన్‌లకు సోమవారం ఉదయం 8.30గంటల నుంచి నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పట్టణ ట్రాన్స్‌కో ఏఈ టీవీ నరసింహ్మం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా మండలంలోని పాలూరు సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. దీంతో ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఇస్తామని వినియోగదారులు, రైతులు ఈ అసౌకర్యాన్ని గుర్తించాలని ఆయన కోరారు.

నిధుల వృథా..



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పక్కాగృహాలు నిర్మించేందుకు సరఫరా చేసిన విలువైన ఇనుప చువ్వలు తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. కాంట్రాక్టర్ సకాలంలో పనులు చేపట్టకపోవడంతోనే ఈపరిస్థితి దాపురించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హౌసింగ్ కార్యాలయ ప్రాంగణంలో ఎంతో విలువైన చువ్వలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పట్టిపోతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేడని, ఇప్పటికైనా అధికారులు స్పందించి నిధులు వృథా కాకుండా ప్రత్యామ్నాయ పనులకైనా వాటిని వినియోగించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- వరికుంటపాడు, (ఆంధ్రజ్యోతి)

ఒక్క ఇల్లు కడితే ఒట్టు..



ఘనంగా అయ్యప్ప పడిపూజ

వింజమూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసన్నరెడ్డినగర్‌లో ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆదివారం ఘనంగా ప డి పూజ నిర్వహించారు. స్వామివారికి అభిషే కాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు వసంత్, ప్రసాద్, మస్తాన్‌రెడ్డి, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

మాతమ్మకు ప్రత్యేక పూజలు

అనంతసాగరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటికంభంపాడు గ్రామదేవత మాతమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈసందర్భంగా పెద్దఎత్తున మహిళలు ఆలయానికి చేరుకొని అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు.

నాగారపమ్మకు..

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మతల్లికి ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ధ్యానంతో సమస్యల పరిష్కారం

వింజమూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో అన్నిరకాల సమస్యలు పరిష్కారమవుతాయని మాస్టర్ వసంత్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో జరిగిన ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలోని కడ్తాల్ మహేశ్వర మహా పిరమిడ్ శక్తి క్షేత్రంలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు జరిగే పత్రీజీ ధ్యాన మహాయాగం కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరుకావాలని కోరారు. శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ధ్యానులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయండి

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల పరిరక్షణకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని తిరుమనకొండ రాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠం పీఠాధిపతి, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు రాజరాజేశ్వరానందస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన రాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠంలో ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ చాలక్‌లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంఘ్ చాలక్ బాల సుబ్బారావు, బుచ్చి ఖండ్ చాలక్ కేశవయ్య, ఖండ్ కార్యవాహ్ వెంకట్రావ్ పాల్గొన్నారు.

గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో పలు గ్రామాలకు బస్సులు నడపడంలేదని, ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి ఇన్నోవేటివ్ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ లెక్కమనేని రాజేష్‌నాయుడు ఆదివారం వినతిపత్రం అందజేశారు.

దోబీఘాట్లు లేక రజకుల అవస్థలు

సీతారామపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు కులవృత్తిదారుల కోసం ఏటా కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదు. దీంతో కులవృత్తిదారుల జీవనం దుర్భరంగా మారింది. ప్రత్యేకించి రజక వృత్తిదారుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సీతారామపురం మండలంలో వందల కుటుంబాలు రజక వృతిలో కొనసాగుతున్నాయి. అయితే మండలంలోని సింగరెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, పొలంగారిపల్లి, గుండుపల్లి, మారంరెడ్డిపల్లి, నెమళదిన్నె, గంగవరం, బసినేనిపల్లి, రొంపిదొడ్ల తదితర గ్రామాల్లో దోబీ ఘాట్లు లేకపోవడంతో ఆయా గ్రామాల్లోని రజకులు దుస్తులు ఉతికేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లోని వాగులు, చెరువుల్లో ప్రమాదమని తెలిసినా దుస్తులను ఉతకాల్సిన పరిస్థితి నెలకొంది. సీతారామపురం గ్రామంలో గతంలో నిర్మించిన దోబీ ఘాట్ శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ బోర్ మోటార్‌కు విద్యుత్ సరఫరా లేకపోవడంతో దోబీ ఘాట్‌ను అలాగే వదిలేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలోని చెరువులు, కుంటలు, వాగులలో ప్రస్తుతం రజకులు దుస్తులు ఉతుకుతున్నప్పటికీ వేసవిలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, బోర్ మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని రజకులు కోరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆదరణ పథకం కింద ఇస్త్రీపెట్టె, టేబుళ్ల కావాలని దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేక పోయిందని, బీసీ కార్పొరేషన్ కింద రజకులు సొసైటీలుగా ఏర్పడి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా అప్పట్లో రుణాలు రాజకీయ జోక్యంతో అందలేదని రజకులు వాపోతున్నారు. ఈ కూటమి ప్రభుత్వంలోనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను తీర్చాలని రజకులు కోరుతున్నారు.



సీతారామపురంలో శిథిలమైన దోబీఘాట్లు

పేకాట స్థావరంపై దాడులు

చేజర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వావిలేరు సమీపంలోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం సాయంత్రం సంగం సీఐ వేమారెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి లక్షా మూడు వేల రూపాయల నగదు, 8 మోటారుబైక్‌లు, 10సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్నవారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఏఎస్ పేట ఎస్‌ఐ సైదులుతో పాటు చేజర్ల, ఏఎస్ పేట, సంగం పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ వేమారెడ్డి మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంటలకు బీమాతో ధీమా

- వెంకటసుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి, దుత్తలూరు



ఈ ముఖాముఖి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), డిసెం బరు 8 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగుచేసే రై తులు పంటల బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని, ప్రీమియం చెల్లించిన రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు.

? ఏయే పంటలకు బీమా చేసుకోవచ్చు.

! మండలంలో శనగ, మినుము, వరి పంటలు సాగు చేసిన రైతులు బీమాకు అర్హులు.

? ప్రీమియం ఎంత చెల్లించాలి.

! శనగ రూ.480, మినుము రూ.285, వరి రూ.630 చొప్పున ఎకరాకు చెల్లించాలి.

? ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టం జరిగిందా.

! ఫెంగల్ తుపాన్ ప్రభావంతో 750 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. నష్టపరిహారం కోసం జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం.

? క్షేత్రస్థాయి పరిశీలనలు చే స్తున్నారా.

! ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించడంతో పాటు రైతుసేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి తెగుళ్ల, నివారణ చర్యలు, పంటల సా గులో మెళకువలు వివరిస్తున్నాం.

భగవద్గీతను పఠించాలి

లింగసముద్రం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలు దైవభక్తితో భగవద్గీత గ్రంధ పఠనం చేయాలని త్రైత సిద్ధాంత- ప్రబోధ సేవాసమితి దుత్తలూరు అధ్యక్షులు ప్రసాద్ తెలిపారు. ఆదివారం తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెం, విశ్వనాధపురం, మాలకొండరా యునిపాలెంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథంపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొండారెడ్డి, పెద్ద కొండారెడ్డి, మాల కొండారెడ్డి, సుధాకర్, వెంకటేశ్వర్లు, పెంచలరత్నం, నరసింహులు, ధనలక్ష్మి, నాగమ్మ, మధు, ఎస్.ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

లైసెన్సు లేకుండా వాహనం నడిపితే కేసు

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఆత్మకూరు వాహన తనిఖీ అధికారి రాములు పేర్కొన్నారు. ఆదివారం ఆయన సంగం బ్యారేజి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కూలీల పేరుతో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామని ఆటోడ్రైవర్లను హెచ్చరించారు.

పేద కుటుంబానికి చేయూత

సంగం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో లక్ష్మమ్మ, దయాకర్ అనే ఓ దళిత పేద కుటుంబానికి జనసేన పార్టీ నాయకులు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు, చిరంజీవి యువత అధ్యక్షుడు భాను కిరణ్ ఆధ్వర్యంలో నెల రోజులకు సరిపడా బియ్యం, పప్పులు, నూనె వంటి సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

గిరిజనుల పక్షపాతి సీఎం చంద్రబాబు

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


గిరిజనులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి

విడవలూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గిరిజనుల పక్షపాత అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. పార్లపల్లి గ్రామంలో ఏఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన గిరిజనుల సమావేశంలో ఆమె పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన ఎస్టీ సబ్‌ప్లాన్, గిరిజన కార్పొరేషన్ నిధులు, విదేశీ విద్య వంటి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం తిరిగి అమలు చేస్తుందన్నారు. ఎన్నికల్లో గిరిజనులు తనకు అండగా నిలిచి ఓటు వేసి గెలిపించారన్నారు. గిరిజనులకు ఆధార్‌కార్డులు లేకపోవడం వలన ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మండలం లో ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి గిరిజనులకు ఆధార్ కార్డులు అందజేస్తానని తెలిపారు. యానాదుల కార్పొరేషన్‌ని ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, తద్వారా ఎస్టీ కాలనీల్లో సీసీరోడ్లు, గృహనిర్మాణాలు, తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు జరుగుతాయన్నారు. అనంతరం గిరిజనులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్డీ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బషీర్, గ్రామ సర్పంచు రామిశెట్టి స్వాతి, టీడీపీ నాయకులు ఆడపాల శ్రీధర్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, అడపాల జనార్దన్‌రెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు మహర్దశ!

● మనుబోలులో 18 పంచాయతీలకు రూ.1.68 కోట్లు

● 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చొరవతో కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేయడంతో డబ్బులేమి నుంచి ఇప్పుడిప్పుడే ఊరట పొందుతున్న గ్రామ పంచాయతీలకు మరింత ఉపశమనం లభించింది. గ్రామ పంచాయతీలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి తొలివిడత 15వ ఆర్థిక సంఘం నిధులను గత నెలాఖరులో విడుదల చేసింది. గడిచిన జూన్ నెలలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిధులు విడుదల చేసింది. ఇవికాక ఒక్కో పంచాయతీకి వడ్డీల కింద కొత్త మొత్తాన్ని అందించింది. ఈ క్రమంలో మండలంలోని 19 పంచాయతీల్లో కాగితాలపూరుకు మినహాయించి 18 పంచాయతీలకు అన్‌టైడ్ గ్రాంటు కింద రూ.67లక్షలు, టైడ్ గ్రాంటు కింద రూ.1.1కోట్లుతో మొత్తంగా రూ. 1కోటి 68లక్షల 4వేల 286 నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనుండడంతో పల్లెలకు మహర్దశ పట్టనుంది.



అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేశా

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో రూ.5లక్షల మేర అప్పులు చేసి గ్రామంలో అవసరమైన పనులు చేయించా. ఒక్కరూపాయి బిల్లులు ఇవ్వలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీలకు నిధులు మంజూరు చేయడం శుభపరిణామం.
- సునీల్‌కుమార్ నాయుడు, లక్ష్మీనరసింహపురం, సర్పంచు

మనుబోలు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా 80శాతం గ్రామ పంచాయతీలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా వాటికి ఉపశమనం కలిగింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు సర్పంచులు వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ ఖర్చు చేసి బిల్లులు రాక లబోదిబోమనేవారు. నాడు కేంద్రం నుంచి విడుదలైన నిధులను సైతం విద్యుత్ బకాయిలు పేరిట మినహాయించడంతో ఇక్కట్లను ఎదుర్కొన్నారు. పంచాయతీరాజ్ చట్టాన్ని జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. పంచాయతీల పట్ల బాధ్యతారహితంగా ప్రవర్తించి స్వపరి పాలన, సుపరిపాలనకు చోటు లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత సీఎం చంద్రబాబు నాయుడు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి పాత బకాయిలను రెండు దఫాలుగా విడుదల చేయించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు గ్రామీణ వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోంది.

● **నేరుగా ఖాతాలకే..**

ప్రస్తుతం విడుదల చేసిన నిధులను కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన నేరుగా ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమచేసింది. ఈ నిధుల్లో 60శాతం టైడ్ నిధులుగా, 40శాతం అన్‌టైడ్ గ్రాంటు కింద విడుదల చేశారు. ఇవి కాక ఒక్కో పంచాయతీకి వడ్డీ కింద 3నుంచి 5వేలు లెక్కన జమ చేసింది.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేయకుండా గత వైసీపీ ప్రభుత్వం వేరే అవసరాలకు మళ్లించుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామ స్వరాజ్యం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల కృషితో నిధులు విడుదల చేయడం హర్షణీయం.
- తిక్కవరపు వెంకటేశ్వర్లు రెడ్డి, పిడూరు ఇన్‌చార్జి సర్పంచు

● **60శాతం టైడ్ గ్రాంటుతో పనులు**

టైడ్ గ్రాంటు కింద విడుదలైన 60శాతం నిధులతో ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటా చెత్త సేకరణ, తాగునీటి సరఫరా, గ్రామసభల నిర్వహణ, రహదారులు, ఇతర సేవలకు ఈ నిధులు ఖర్చుచేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. అదే విధంగా అన్‌టైడ్ గ్రాంటుగా విడుదల చేసిన రూ.67లక్షల్లో పదిశాతం విద్యుత్ బకాయిలకు ఖచ్చితంగా చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మిగిలిన నిధులను కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు, అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో అభివృద్ధి పనులకు ఖర్చుచేసుకునేందుకు వాడుకోవచ్చునని తెలిపింది.

● **గతంలో బ్లీచింగ్‌కూ కరువే...**

గత వైసీపీ పాలనలో పంచాయతీల్లో బ్లీచింగ్ పిచికారి చేసేందుకు నిధులు లేవని ఏకంగా సర్పంచులే అధికారుల ముందే సభలు, సమావేశాల్లో చెప్పుకొచ్చారు. సాధారణంగా ప్రతి పంచాయతీకి ఆరు నెలలకోసారి చొప్పున ఏడాదికి రెండు దఫాలుగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తుంది. 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు ఐదేళ్లపాటు పంచాయతీలకు వస్తాయి. అయితే గడిచిన సంవత్సరాల నిధులు కేంద్రం నుంచి వచ్చినా ఆనాటి ప్రభుత్వం పంచాయతీలకు ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కు తీసుకుని విద్యుత్ బకాయిలకంటూ వాడేసుకుంది. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు ఆందోళనలు చేసినా ఏమాత్రం పట్టించుకోలేదు.

నిబంధన మేరకే ఖర్చు చేయాలి

గడిచిన ఆరునెలల్లోనే రెండు విడతలుగా ఆర్థిక సంఘం నిధులు, వడ్డీలు పంచాయతీలకు వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పంచాయతీరాజ్ నిబంధనల మేరకు కార్యదర్శులు సర్పంచులచే నిధులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలి. నిధులు దుర్వినియోగం చేయకుండా పంచాయతీల్లో మౌలిక వసతులను కల్పించాలి.
- నారాయణ, పంచాయతీ విస్తరణాధికారి

పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినంపై హర్షం


చంద్రబాబు, పవన్‌కల్యాణ్, సోమిరెడ్డిల చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు

పొదలకూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 15వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అధికారి కంగా అమరజీవి పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం జరపాలని జీవో విడుదల చేయడం సంతోషించదగిన విషయమని నెల్లూరు రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమర్తలూరు చెంచయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ పొట్టి సుధా కర్ అన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీ బస్టాండు ఆవరణంలో అమరజీవి పొట్టిశ్రీరా ములు విగ్రహం వద్ద పొదలకూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకులూ రు విజయ్, పిన్నెల ప్రభాకర్, మణిస్వామి, తన్నీరు సురేష్ బాబు, గుర్రం మీరామధు, పైడా కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోండి

● ఎమ్మెల్యే సోమిరెడ్డికి ముస్లింల వినతి

ముత్తుకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముత్తుకూరులోని ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానిక ముస్లింలు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని కోరారు. ఆదివారం నెల్లూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ముత్తుకూరులో ఉన్న ముస్లిం శ్మశాన వాటిక, ఈద్గా అభివృద్ధికి వీలుగా మరికొంత అదనపు భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్, నాయకులు షేక్.షఫీవుల్లా, షేక్.మహ బూబ్‌బాషా, షేక్.ఫరీద్‌బాబు, కాలేషా, రషీద్, నాగూర్ గని, షాబ్దామ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమాన్ చాలీసా అఖండ పారాయణం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : హనుమద్వ్రతం పర్వదినం సందర్భంగా సోమవారం నుంచి 12వతేదీ వరకు అఖిల భారత హనుమాన్ దీక్షా పీఠం (విజయవాడ) ఆధ్వర్యంలో శబరి శ్రీరామ క్షేత్రంలో అఖండ హనుమాన్ చాలీసా పారాయణం జరగనుంది. ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనాలని క్షేత్రం వ్యవస్థాపక చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 13వతేదీ హనుమద్వ్రతం జరుగుతుందని తెలిపారు. అదేరోజు సాయంత్రం 4గంటలకు శ్రీరామ స్తూపంలో రామకోటి గ్రంథ నిక్షిప్త కార్యక్రమం కూడా జరుగుతుందని భక్తులందరూ తరలిరావాలని కోరారు.

ఘనంగా 'అంతరంగ వీక్షణం' ఆవిష్కరణ


అంతరంగ వీక్షణం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చిన్ని నారాయణ రావు సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టౌనుహాలు ఏసీ రీడింగ్ రూమ్‌లో అంతరంగ వీక్షణం సంకలనం ఆవిష్కరణ ఘనంగా జరిగింది. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్ విజయ భాస్కర్‌రావు గ్రంథ ఆవిష్కరణ చేశారు. సాహిత్యం వర్ధిల్లాలంటే విద్యార్థులకు తెలుగు భాషలో చదవడం, రాయడం నేర్పించాలని అభిప్రాయపడ్డారు. విమర్శకుడు, బహుతత్వవేత్త జీ లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ సమాజంలో ఉన్న వాటిని అందంగా ప్రజలకు అందించడమే కవిత్వం, సాహిత్యం అన్నారు. రచయిత ఆలోచన సంఘ సంస్కరణ పైనే ఉండాలని సూచించారు. అంతరంగ వీక్షణం గ్రంథాన్ని ఈతకోట సుబ్బారావు సమీక్షించారు. అనంతరం సోషల్ మీడియా - సమాజం అనే అంశంపై కవితల పోటీ ఆసక్తికరంగా జరిగింది. చిన్ని నారాయణ రావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మల్లెతీగ పత్రిక సంపాదకుడు కమిలిశ్రీ, పెన్నా రచయితల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి, సృజన క్రాంతి దినపత్రిక సంపాదకుడు, సంకలనకర్త కొమ్మవరపు విల్సన్‌రావు తమ స్పందన తెలియజేశారు.

ఆర్యవైశ్య వృద్ధులకు పింఛన్ల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రంగనాయకుల పేట ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఆదివారం పేదలైన ఆర్యవైశ్య వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. 3వనగర పోలీస్‌స్టేషన్ సీఐ ఎం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసి యేషన్ సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. అనంతరం ప్రాజెక్టు చైర్మన్ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఈ కార్య క్రమాలను అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్ బాబు, ప్రధాన కార్యదర్శి ఏవీ ఫణీంద్ర, కోశాధికారి బీ సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

ఘనంగా విశ్వనాథ శ్రౌతుల జయంతి


వేద పారాయణ చేస్తున్న గురుదత్తశర్మ, సుకుమారశర్మ

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీవీఎస్ కల్యాణ్ సదన్‌లో ఆదివారం వేద సాహిత్య పరిషత్ ఆధ్వర్యం లో విశ్వనాథ శ్రౌతుల 104వ జయంతి ఘనంగా జరిగింది. గణపతి పూజ, కలిశస్థాపన అనంతరం వేద పండితులు నేలనూతల గురుదత్త శర్మ, సూరం వెంకట సుకుమార శర్మ ఘనాపాటికృష్ణయజుర్వేద పారాయణం జరిగాయి. సాయంత్రం జయంతి సభ నిర్వహించారు. మాచవోలు బాస్కరశర్మ మాట్లాడుతూ విశ్వనాథ శ్రౌతులు హిమాలయాల నుంచి రామేశ్వరం వరకు పర్య టించారని తెలిపారు. లోక కల్యాణం కోసం ఆయన వెయ్యికిపైగా సోమయా గాలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అరివిత్తారు భర్గగణపతిశర్మ విశ్వశాంతి కోసం శాంతి మంత్రం పఠించారు.

న్యూస్ బాక్స్

తిరుమల పవిత్రతను కాపాడాలి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల పవిత్రతను కాపాడాలని, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి టీటీడీ ప్రస్తుత చైర్మన్ బీఆర్ నాయుడు పూర్వ వైభవం తీసుకువస్తారని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలో బీఆర్ నాయుడు అభినందనసభ జరిగింది. గాయకుడు పాటూరు శ్రీనివాసులును సత్కరించారు. అమానుల్లాఖాన్, ప్రభాకర్, కనకరాజు, నజీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అంబాపురం గ్రామ రెవెన్యూ అధికారి రమణయ్య ఆదివారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... రూరల్ మండలం అక్కచెరువుపాడు గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు మట్టి తవ్వి తరలిస్తున్నారు. ఈ విషయాన్ని ఆ గ్రామ వీఆర్‌ఏ నాగయ్య ఈ నెల 3న వీఆర్వో రమణయ్యకు తెలియజేశారు. దీంతో రమణయ్య అక్కడికి చేరుకుని మట్టిని అక్రమంగా తరలిస్తున్న రెండు టాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును విచారిస్తున్నారు.

పోతిరెడ్డిపాళెంలో వైద్య శిబిరం

కోవూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడుగుపాడులలో ఆదివారం అశోక్‌రెడ్డి సేవా సమితి సభ్యులు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంలోని ఆర్ఆర్ హాస్పిటల్ యాజమాన్యం రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జీఆర్ రెడ్డి, టీడీపీ నాయకులు తిరుమూరు అశోక్‌రెడ్డి, యద్దలపూడి నాగరాజు, జీవీ నాగరాజు, కిషోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రం పథకాలను సద్వినియోగం చేసుకోండి'

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్ పథ కాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్ కోరారు. నగరంలోని రామలింగాపురం చాకలివీధిలో స్థానికులకు ఆయుష్మాన్ భారత్ పథకంపై ఆదివారం అవగా హన కల్పిం చారు. పలువురిని ఆ పథకంలో చేర్పించారు. కార్యక్రమంలో పార్టీ రామలిం గాపురం మండల ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా కమిటీ సభ్యురాలు గంపల మంజుల మహాత్మాగాంధీ, ఆశ్రమ స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం ఆమె స్కూల్ విద్యార్థులకు మహాత్మాగాంధీ ముఖ్యమైన జీవిత విశేషాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌జాన్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం


అవార్డు అందుకుంటున్న అమీర్‌జాన్

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోత) : నగరానికి చెందిన చిత్రకారుడు అమీర్‌జాన్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించింది. ఆయన పసుపు, కారంపొడితో 2022 ఫిబ్రవరి 2న 73.39 చదరపు మీటర్ల వైశాల్యం కలిగిన బొమ్మను చిత్రించారు. దీనికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఈ రికార్డు సర్టిఫికెట్‌ను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ చింతపట్ల వెంకటాచారి ఆదివారం నగరంలోని 25 కళా సంఘాల కార్యాలయంలో అమీర్‌జాన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమం లో 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆదరణ ట్రస్ట్ నిర్వాహకుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సుధాకర్

ముత్తుకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదరణ ట్రస్ట్ ద్వారా చేపట్టిన ప్రజాసేవకు గుర్తింపుగా ముత్తుకూరుకు చెందిన దూడల సుధాకర్‌కు జర్మనీకి చెందిన పీస్ యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆదివారం చెన్నైలో జరిగిన కార్యక్రమంలో యూనివర్శిటీ ప్రతినిధుల నుంచి సుధాకర్ డాక్టర్ పట్టా అందుకున్నారు. ఈ డాక్టరేట్ తన బాధ్యతను మరిం త పెంచిందని ఆయన అన్నారు.

ప్రొఫెసర్ మురళికి ఘన సన్మానం


మురళిని సన్మానించిన గ్రామస్థులు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కోవూరు సమీపంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మండలంలోని పెనుబల్లికి చెందిన దాసరి మురళి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకోవడంతో స్థానికులు ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు. స్థానిక రాములోరి గుడి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సీహెచ్ వినయ్ నారాయణ, కీలుకుప్ప శ్రీనివాసులుయాదవ్, దాసరి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

శరణం.. శరణం అయ్యప్పా !

● కొనసాగుతున్న మండల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం) , డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్వామియే... శరణం అయ్యప్ప... అంటూ భక్తులు చేసే శరణు ఘోషతో నగరంలోని అయ్యప్ప స్వామి ఆలయం మారుమోగుతోంది. ఆలయంలో మండల పూజలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం పాలాభిషేకం, మహాగణపతి హోమం, ఉషఃపూజ, నవకాభిషేకం, అయ్యప్పకు పుష్పాభిషేకం, ఉచ్ఛపూజ, శ్రీవేలి ఉత్సవం జరిగాయి. దీక్షాధారులకు అన్న ప్రసాదం అందజేశారు. సాయంత్రం మహాదీపారాధన, భగవతిసేవ, అత్తాళ్ల పూజ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూరం, హరివరాసనం నిర్వహించారు. ఉభయకర్తలుగా దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, మంజులమ్మ, కృష్ణప్రసాద్ రెడ్డి, షర్మిలారెడ్డి, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, సుదర్శనమ్మ, యశ్వంత్‌రెడ్డి వ్యవహరించారు. ఆలయ అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, గడ్డం విజయకుమార్, పావళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'అపోలో'లో విజయవంతంగా భుజం కీళ్ల మార్పిడి

● డాక్టర్ కార్తీక్‌రెడ్డి, డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో వైద్య నిపుణులు

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని అపోలో ఆసుపత్రిలో విజయవంతంగా భుజం కీళ్ల మార్పిడి జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ప్రముఖ షోల్డర్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ పమ్మి కార్తీక్‌రెడ్డి, డాక్టర్ మదన్ మోహన్ మాట్లాడారు. నగరా నికి చెందిన రవీంద్రరెడ్డి (64), బుచ్చిరెడ్డి (72) భుజం నొప్పితో ఆసుపత్రికి వచ్చారన్నారు. పరీక్ష లు నిర్వహించి భుజం కీలు మా ర్పిడి చేయాలని నిర్ధా రించామ న్నారు. రోబోటిక్ ద్వారా భుజం కీళ్ల మార్పిడి విజయవంతంగా నిర్వహించామని, ఈ చికిత్సతో ఎలాంటి నొప్పి ఉండదన్నారు. కంప్యూటరైజ్డ్ ప్లానింగ్ టెక్నాలజీ, సిటీ స్కాన్ ద్వారా శస్త్రచికిత్స చేశామని తెలిపారు. ఆరు వారాల్లో వ్యాధిగ్రస్తులు కోలుకుని తమ పనులు చేసుకుం టారని చెప్పారు.

టీవీఎస్ స్కూటీ విజేత శోభ



డైలీ డ్రా విజేతకు బహుమతి అందజేస్తున్న నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చందన సీఎంఆర్ క్రిస్మస్, న్యూ యర్, సంక్రాంతి ఆఫర్లలో భా గంగా నిర్వహిస్తున్న ఎక్స్‌ప్రెస్ సేల్ వీక్లీ డ్రా ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హాజరై వీక్లీ డ్రా తీసి విజేతలను ప్రకటిం చారు. టీవీఎస్ జెస్ట్ స్కూటీని మైపాడు గేట్‌కు చెందిన జీ శోభ (కూపన్ నెంబరు 16,339) గెలుచుకున్నారు. గతవారం డైలీ డ్రాలో విజేతలు 35 మందికి బహుమతులను నుడా చైర్మన్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ చందనా బ్రదర్స్‌లో తక్కువ రేట్లకు వస్త్రాలు, బంగారు ఆభరణాలు విక్రయించడమేకాక విలువైన బహుమతులు అందజేస్తున్నందుకు సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావును అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఎక్స్‌ప్రెస్ సేల్స్ సంక్రాంతి పండుగ వరకు కొనసాగుతుందని తెలిపారు. డైలీ ఆఫర్లతోపాటు లక్కీ డ్రా విజేతలకు డైలీ 5 రకాల గృహోపకరణాలు, 7 టీవీఎస్ స్కూటీలు, క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు బంపర్ డ్రాలో టాటా కార్లు అందజేస్తున్నామని చెప్పారు. అవకాశాన్ని జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజీయాడ్స్ పెంచలయ్య, శైలేష్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలిశాల ఊరేగింపు


కలిశాలతో భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వైకుంఠపురం మహాలక్ష్మీ ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి అభిషేకం కోసం కలశాల ఊరేగింపు కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధ లతో జరిగింది. 108 మంది మహిళలు 108 కలిశాలతో రంగనాథస్వామి ఆలయ ఘాట్ నుంచి పెన్నానదీ జలాలు సేకరించారు. ఆ కలిశాలతో ఊరే గింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ సభ్యుడు కాకాణి వెంకటేష్, గుణపాటి భాస్కరయ్య, ధన్వి శ్రీనివాస్, కుడుముల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 9 డిసెంబరు 2024

వి రన్ ఫర్ తిరుపతి



ఉత్సాహం ఉరకలేసింది. వి రన్ ఫర్ తిరుపతి.. కార్యక్రమంలో పిల్లలు, యువత హుషారుగా పరుగు తీశారు. శాప్, యాంటీ నార్కోటిక్స్ పోలీస్ విభాగం, వి వైబ్ ప్రైవేటు సంస్థ సంయుక్తంగా ఆదివారం ఉదయం తిరుపతిలో ఈ కార్యక్రమం నిర్వహించాయి. తారకరామ క్రీడా మైదానం నుంచి ఎస్వీయూ రైల్వే వంతెన మీదుగా చెర్లోపల్లె క్రాస్ వరకు పరుగు పందెం నిర్వహించారు. క్రీడాకారులు, పోలీసులు 10కే రన్, విద్యార్థులు 5కే రన్, పిల్లలు, పెద్దలు 3కే రన్ ఎంచుకొని పోటీపడ్డారు. అందరూ కాషాయ రంగు టీ షర్టులతో రోడ్డుపై పరుగు తీస్తుంటే స్థానికులు ఆసక్తిగా తిలకించారు. పరుగు పందెంలో విజేతలకు బహుమతులు అందజేశారు. శాప్ చైర్మన్ రవినాయుడు, ఎస్పీ సుబ్బరాయుడు, ఈగల్ ఎస్పీ నగేష్, ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు తదితరులు మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు, మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు.

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి



వరి పంటలో మృతదేహాన్ని మోసుకెళ్తున్న రావులపాడు గ్రామస్తులు

శ్మశానానికి దారేదీ?

పెళ్లకూరు మండలం రావులపాడులో శ్మశానానికి దారిలేక ఇబ్బంది పడుతున్నారు. ఆ గ్రామానికి చెందిన దుర్గి వెంకటరమణ నాయుడు ఆదివారం మృతిచెందారు. శ్మశానికి దారిలేకపోవడంతో ఆయన మృతదేహాన్ని పొలాల మీదుగా కిలోమీటరు దూరంలో ఉన్న స్వర్ణముఖి నది ఒడ్డు వరకు మోసుకెళ్లాల్సి వచ్చింది. అక్కడ చెట్లు పుట్టలతో నిండిపోయి ఉండటంతో ఖననం చేయడానికి ఇబ్బంది పడాల్సి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

- పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సుమారు 29 వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,496మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,860మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,390మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 908, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 268మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 223మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 54మంది పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 19,470 విక్రయించినట్టు అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

ఇంకా జగనే సీఎం అట!

- సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఎండీయూ వాహనంపై తొలగిన బొమ్మ





ఉదయం జగన్ బొమ్మతో.. సాయంత్రం తొలగిన బొమ్మ

కూటమి ప్రభుత్వం ఏర్పాటై.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయి ఆరు నెలలు దాటింది. అయినా పిచ్చాటూరు మండలం ఎస్ఎస్‌బీ పేటలో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న వాహనంపై మాత్రం జగన్ బొమ్మే ఉంది. ఆదివారం ఉదయం రేషన్ సరుకుల పంపిణీ సందర్భంగా ఈ విషయం బయటపడింది. జగన్ బొమ్మ ఇంకా తొలగించకుండా గ్రామాలకు వెళ్లి సరకులు పంపిణీ చేస్తుండటం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై తహసీల్దార్ రమేష్‌బాబు స్పందించారు. సాయంత్రానికంతా జగన్ బొమ్మను తొలగించారు. కానీ, నవరత్నాల లోగో మాత్రం అలాగే ఉంది.

- పిచ్చాటూరు, ఆంధ్రజ్యోతి

ఆగని అవినీతి!

సస్పెన్షన్లు తప్ప వీగిపోతున్న కేసులు

నేడు అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం

ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారంటూ తహసీల్దారు క్యాడర్ అధికారి పరమేశ్వరస్వామిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసు నడుస్తుండగానే వారం కిందట ఆయనకు ఎర్రావారిపాలెం తహసీల్దారుగా పోస్టింగ్ వచ్చింది. దీని వెనుక రాజకీయ పలుకుబడి ఉందన్న విమర్శలున్నాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తూ ఆదాయానికి మించి ఆస్తులు కూడబబెట్టారనే ఆరోపణలపై మదనపల్లె మాజీ ఆర్డీవో మురళిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆయన ఇల్లు, బంధువులు, స్నేహితుల ఇళ్లపై దాడులు చేసి భారీ మొత్తంలో ఆస్తుల రికార్డులు, నగదు, బంగారు నగలు ఇతరత్రా పత్రాలు సీజ్ చేశారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



డిసెంబరు 9. అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం. ఏటా ఈ కార్యక్రమం జరుపుకొంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. లంచం తీసుకుంటున్న అధికారులనూ ప్రజల ఫిర్యాదుతో పట్టుకుంటున్నారు. అయినా, అవినీతి ఆగడం లేదు. రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లు, ఓటు రాజకీయాలతో కేసులు పక్కదారి పడటమే కారణమన్న విమర్శలున్నాయి. గత రెండేళ్ల కాలంలో దాదాపు 8 కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో పట్టుబడిన అధికారులను సస్పెండు చేస్తున్నారు. అయితే ఏసీబీ కేసుల పరిస్థితిని పరిశీలిస్తే అవినీతి నిరోధక శాఖకు పట్టుబడిన వారిలో కొందరికి మాత్రమే శిక్షలు పడుతుండగా మరికొందరు ఎలాంటి చర్యలు లేకుండా మళ్లీ ఉద్యోగంలో చేరుతున్నారు. మరికొందరిపై విచారణకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంలేదు. లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న కొన్ని కేసుల్లో బాధితులకు సర్దిచెప్పడం లేదా ఒత్తిడి తీసుకొచ్చి కోర్టుల్లో సాక్ష్యం చెప్పనీయకుండా చేసి అవినీతి అధికారులు బయటపడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అవినీతి కేసుల్లో పట్టుబడిన వారిపై చర్యలు ఉంటేనే అవినీతి తగ్గే అవకాశాలున్నాయి.

రెండు రకాల కేసులు

సాధారణంగా ఏసీబీ అధికారులు రెండు రకాల కేసులు నమోదు చేస్తారు. ఇందులో మొదటిది లంచం అడుగుతున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. సంబంధిత ఉద్యోగులు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం. వీటిని ట్రాప్ కేసులంటారు. రెండోది ఆదాయానికి మించి ఆస్తుల కేసు. అవినీతి చేసి ఆస్తులు సంపాదించినట్లు ఫిర్యాదులు వస్తే.. ఏసీబీ అధికారులు మొదట వివరాలు సేకరిస్తారు. ఆ తర్వాత వారి ఇళ్లు, బంధువులు, బినామీల ఇళ్లపై ఒకేసారి దాడులు చేస్తారు. డబ్బు, పత్రాలు, బంగారం, వెండి వస్తువులు స్వాధీనం చేసుకుంటారు. ఆ తర్వాత వారి జీతం, ఇతర అధికారిక ఆదాయాలు అన్నీ లెక్కవేసి అంతకంటే ఎక్కువ ఉంటే అది ఎలా వచ్చిందో విచారణ జరుపుతారు. సరైన కారణాలు చెప్పకుంటే ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని కేసు పెడతారు. ఆ ఆదాయానికి సంబంధించి సాక్ష్యాధారాలు చూపితే కేసు ఉండదు. స్వాధీనం చేసుకున్న వాటిని వెనక్కి ఇచ్చేస్తారు.

ఫిర్యాదు చేస్తేనే ప్రయోజనం

వివిధ పనులకోసం అధికారులు లంచం కోసం వేధిస్తే తమకు ఫోను చేసి ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. 24 గంటలూ సేవలు అందుబాటులో ఉండే అవినీతి నిరోధక శాఖ హెల్ప్ లైన్ నెంబరు 1064కు.. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఏసీబీ అదనపు ఎస్పీ 94404 46130, డీఎస్పీ 94404 46190, కార్యాలయ ఫోన్ నెంబరు 0877-2220252కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. అవినీతిని అరికట్టడం అనేది ఓ సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రజలు ఫిర్యాదు చేయాలని అధికారులు కోరుతున్నారు. ఇక, అవినీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటే మిగతా వారు వెనకడుగు వేస్తారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 2,454 మంది హాజరు

తిరుపతి(విద్య), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం జరిగిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు 2,454 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం ఏటా ఎన్ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తుంది. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పరీక్షకు జిల్లానుంచి 2,553 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి ఆదివారం 12 కేంద్రాల్లో ప్రతిభా పరీక్ష నిర్వహించగా, 99 మంది గైర్హాజరవడంతో 2454 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

శేషాచలంలో వన్యప్రాణుల సంరక్షణకు ముందడుగు

వైల్డ్ లైఫ్ శాంచూరి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు

మంగళం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : శేషాచల అటవీ ప్రాంతంలోని అరుదైన జంతువులను, పక్షులను, కీటకాలను రక్షించే దిశగా అటవీ శాఖ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా వైల్డ్ లైఫ్ శాంచూరి ఏర్పాటుకు ప్రయత్నాలు ఊపందుకున్నాయి. భాకరాపేట, తిరుపతి, బాలాపల్లె, యాంటీ పోచింగ్ రేంజ్‌లను కొత్తగా ఏర్పాటు చేసే వైల్డ్ శాంచూరి కిందకు తీసుకువస్తారు. దీనికి ఒక డీఎఫ్‌వోను నియమించుకున్నారు. అంతేకాకుండా అదనపు నిధులు, సిబ్బందిని కూడా కేటాయించే అవకాశముంది. శేషాచలం కొండలకు ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంఖ్య పెరిగి జనారణ్యంలోకి రావడం, రోడ్డు ప్రమాదాల్లో, వేటగాళ్ల బారిన పడి ప్రాణాలు కోల్పోతుండడంతో వాటి సంరక్షణకు అటవీశాఖ వైల్డ్‌లైఫ్ శాంచూరి ఏర్పాటు చేస్తోంది. శేషాచల కొండల్లో అరుదైన పునుగుపిల్లి, దేవాంగ పిల్లి, బంగారుబల్లి, అలుగు, బిట్టుడత వంటివే కాకుండా ఏనుగులు, చిరుతలు, ఎలుగుబంట్లు, రేసు కుక్కలు, ముళ్ల పందులు, అడవిపందులు, జింకలు, దుప్పులు, నక్కలు, పాములు, పక్షులు, సీతాకోకచిలుకలు, కీటకాలు నివాసాలు ఉంటున్నాయి. గతంలో శేషాచల కొండల్లో జరిగిన పరిశోధనలో సైతం ఇక్కడ అనేక అరుదైన వృక్ష, జంతు జాలాలను గుర్తించారు. వీటితోపాటు అంతరించిపోయే దశలో ఉన్న పెద్దపులులకు కూడా శేషాచలకొండల్లో అనుకూల వాతావరణం ఉండడంతో ఇప్పటికే శేషాచల టైగర్ కారిడార్‌కు నిర్ణయం తీసుకున్నారు. వైల్డ్ లైఫ్ శాంచూరి ఏర్పాటు చేస్తే అటవీ ప్రాంతంలోని అరుదైన వృక్షాలు, వనమూలికలే కాకుండా జంతుజాలాన్ని కూడా సంరక్షించడానికి వీలు కలుగుతుంది. ఇందులో భాగంగానే కొన్ని రోజుల క్రితం తిరుపతి కపిలతీర్థం వద్దగల సీసీఎఫ్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం కూడా నిర్వహించారు. హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ (హెచ్‌వోడీ) చిరంజీవి చౌదరి పాల్గొని వైల్డ్ లైఫ్ శాంచూరి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకుని, రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపినట్లు తెలుస్తోంది.

తిరుపతిలోని హోటల్‌కు మళ్లీ బాంబు బెదిరింపు

మెయిల్ రావడంతో అప్రమత్తమైన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటళ్లకు మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్స్ మొదలయ్యాయి. రెండు నెలల కిందట నాలుగైదు హోటళ్లకు వరుసగా బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా తిరుపతిలోని రాజ్‌పార్కు హోటల్‌లో ఇంప్రువైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైడర్లు ఏర్పాటు చేశామని త్వరలో అవి పేలతాయంటూ హోటల్‌కు మెయిల్‌కు, మేనేజర్ సుశాయ్ వాట్సాప్‌కు ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో హెచ్చరికలు వచ్చాయి. ఈ మెయిల్‌ను అలిపిరి సీఐ రాంకిషోర్‌కు పంపారు. డీఎస్పీ వెంకటనారాయణ ఆదేశాల మేరకు సీఐ రాంకిషోర్ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగార్జున రెడ్డి, లోకేష్‌బాబు, సిబ్బంది. బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్లు హోటల్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. వంటగదులు, యాత్రికులు బస చేసిన గదులు, డైనింగ్ హాళ్లు, వెయిటింగ్ హాళ్లు, రిసెప్షన్ కౌంటర్లు, మేనేజర్ గదిని తనిఖీ చేశారు. ఎక్కడా బాంబులు లేవని నిర్ధారించారు. ఈ బెదిరింపు మెయిల్ కూడా ఐఎస్ఐ ఉగ్రవాదుల పేరిట వచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు.



హోటల్‌లో తనిఖీ చేస్తున్న బాంబు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది

ఘనంగా మహంతు ఉత్సవం



తిరుచానూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో పద్మావతి అమ్మవారికి ఆదివారం మహంతు ఉత్సవం జరిగింది. అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు ముగిసిన రెండో రోజు పుట్టింటికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని పద్మసరోవరం సమీపంలోని హథీరాంజీ మఠంలోని ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. మఠం అధికారులు సమర్పించిన సారెతో అమ్మవారికి అర్చకులు అభిషేకం నిర్వహించారు. అనంతరం సర్వ అలంకార శోభితురాలైన అమ్మవారు పల్లకిని అధిరోహించి భక్తులను సాక్షాత్కరించారు. పల్లకీలో ఊరేగింపుగా సాయంత్రం ఆలయానికి చేరుకున్నారు. అంతకు ముందు మఠం అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి స్థానికులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కరనాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బియ్యం లారీ వద్ద డీటీ ఓబయ్య, పోలీసులు

20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

తడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 20 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు, సివిల్ సప్లయిస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి చేనిగుంట పాత వైన్‌షాపు వద్ద ఓ లారీలో రేషన్ బియ్యం ఉందని సమాచారం అందడంతో ఎస్ఐ కొండపనాయుడు, సివిల్ సప్లయస్ డీటీ ఓబయ్య అక్కడకు చేరుకొని డ్రైవర్ శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నారు. లారీలో 441 బస్తాల్లో సుమారు 20 టన్నుల రేషన్ బియ్యం ఉండడంతో గోదాముకు తరలించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. లారీ డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు బియ్యం యజమాని ప్రతాప్ నాయుడిపై కేసు నమోదు చేశారు.

క్రీడాకారులు ఒలింపిక్స్ స్థాయికి ఎదగాలి


ఆర్చరీ క్రీడాకారులతో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గూడూరుకు చెందిన ఆర్చరీ క్రీడాకారులు ఒలింపిక్స్ స్థాయికి ఎదగాలని, అందుకు తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఏఆర్‌డి ప్రభుత్వ స్టేడియంలో వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్చరీలో జాతీయస్థాయిలో ప్రతిభచాటిన క్రీడాకారులకు మెమెంటోలు, ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థికి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరుకు చెందిన ఎంతో మంది క్రీడాకారులు హాకీలో జాతీయస్థాయిలో, క్రికెట్‌లో రాష్ట్రస్థాయిలో రాణించారన్నారు. ప్రస్తుతం ఆర్చరీలో జాతీయస్థాయిలో రాణించడం శుభపరిణామమన్నారు. పట్టణానికి చెందిన క్రీడాకారుడు తరునీష్ జత్య ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించడం పట్టణానికి గర్వకారణమన్నారు. గోల్డ్‌మెడల్ సాధించిన తరునీష్ జత్యకు రూ.30వేలు, అతనికి తర్ఫీదు ఇచ్చిన కోచ్ శంకర్‌కు రూ.20వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశానన్నారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్, వసంత్‌కుమార్, బెజవాడ రమేష్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, దీపక్ ఆకాష్, లవకుమార్, చిరంజీవి, పురుషోత్తం, మునీఫ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయండి


డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో అక్రమంగా సస్పెండ్ చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రిజనల్ అధ్యక్షుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఆదివారం డిపో వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ సభ్యుల పట్ల అధికారులు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి విడనాడాలన్నారు. డ్రైవర్లు, కండక్టర్లను డిపో మేనేజర్ అక్రమంగా సస్పెండ్ చేయడం మంచిపద్ధతి కాదన్నారు. ఏకపక్షంగా వ్యవహరించడం, ఉద్దేశపూర్వకంగా విధుల నుంచి సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శేషయ్య, కిరణ్, కృష్ణ, రఘురామ్, సుబ్రహ్మణ్యం, రమణయ్య, ఎంఎస్ వాసులు, భాస్కర్, కృష్ణయ్య, సురేష్, ప్రసాద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌కు లిఫ్ట్ మంజూరు


ఎంపీ గురుమూర్తిని సత్కరిస్తున్న
రైల్వే ప్రాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు


నాయుడుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్‌కు లిఫ్ట్ మంజూరైనట్లు సదరన్ రైల్వే ప్రాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్ ఆదివారం తెలిపారు. రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ లేకపోవడంతో వృద్ధులు, వికలాంగులు, చిన్నారులు ప్లాట్‌ఫాం మారేందుకు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఈ విషయాన్ని తిరుపతి ఎంపీ గురుమూర్తి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సదరన్ రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి లిఫ్ట్ మంజూరు చేయించారని తెలిపారు. ఆదివారం ఎంపీ గురుమూర్తిని నాయుడుపేట సదరన్ రైల్వే ప్రాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సత్కరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణాషాపు దగ్ధం


కాలిపోయిన దుకాణంలోని వస్తువులు

వాకాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూపిలిపాళెం గ్రామంలోని షేక్ లతీఫ్‌కు చెందిన కిరాణాషాపు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడి కథనం మేరకు... ఆదివారం ఉదయం దుకాణంలో ఒక్కసారిగా మంటలు చేలరేగడంతో షేక్ లతీఫ్ భయంతో రోడ్డు పైకి పరుగులు తీశాడు. స్థానికులు బిందెలతో నీళ్లు తీసుకువచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దుకాణంలోని ఫర్నీచర్, ఫ్రిజ్, ఐస్‌క్రీమ్ యూనిట్, కంప్యూటర్, సీసీ కెమెరా, కిరాణ సామానులు కాలిపోయాయి. సుమారు రూ.7 లక్షలు నష్టం వాటిల్లిందని షేక్ లతీఫ్ తెలిపారు.

శిథిలావస్థలో ఎంఈవో కార్యాలయం



పెచ్చులూడిపోతున్న శ్లాబు

తడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికే పలుచోట్ల శ్లాబు పెచ్చులూడిపోయి ఇనుక ఊచలు దర్శనమిస్తున్నాయి. మరి కొన్నిచోట్ల ఇప్పుడిప్పుడే పెచ్చులూడి పగుళ్లు కనిపిస్తున్నాయి. గత ఐదేళ్లుగా కార్యాలయంలో చిన్నపాటి వర్షం కురిసినా భవనం ఉరుస్తోంది. దీంతో కార్యాలయ సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎంఈవో కార్యాలయాలనికి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

బ్రాహ్మణ సేవా సమాఖ్య కార్యవర్గం ఎంపిక

గూడూరు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాహ్మణ భవ నంలో ఆదివారం బ్రాహ్మణ సేవా సమాఖ్య నూతన వర్గాన్ని ఎంపిక చేసినట్లు సమాఖ్య సభ్యులు తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా యరగుడిపాటి చలపతిరావు, అధ్యక్షుడిగా ఆనిమెళ్ల శివకుమార్, కార్యదర్శిగా చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారిణిగా విద్యలలిత, కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడవిలా శ్మశానవాటిక



ముళ్లచెట్లతో నిండిపోయిన శ్మశానం - మూసుకుపోయిన దారి

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలోని చల్లకాలువ సమీపంలో గల శ్మశానవాటిక అడవిలా మారింది. మృతదేహాలను తీసుకువెళ్లే దారి ముళ్లచెట్లతో మూసుకుపోయింది. అంత్యక్రియలు నిర్వహించడానికి కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. పట్టణ పరిధిలోని చల్లకాలువ సమీపంలో హిందూ శ్మశానవాటిక ఏర్పాటు చేశారు. దూర్జటినగర్, బనిగిసాహెబ్‌పేట, జనార్దన రెడ్డి కాలనీ, అశోక్‌నగర్, అరుందతీయపాళెం తదితర ప్రాంతాలకు చెందిన మృతులకు ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. శ్మశానానికి వెళ్లే మార్గం ముళ్ల చెట్లతో కమ్మేసి ఉండడంతో దారి సౌకర్యం కూడా లేకుండా పోయిందని, అడవిని తలపిస్తుండడంతో మృతదేహాలను ఖననం చేయాలన్నా ఇబ్బందులు పడాల్సివస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా చల్లకాలువ పక్కనే ఉండడంతో వరదల సమయంలో శ్మశాన స్థలం కోతకు గురై కుంచించుకు పోతుందని చెబుతున్నారు. శ్మశానవాటికను అభివృద్ధి చేయడంతో పాటు ప్రహరీ నిర్మించాలని, కాలువ కోతకు గురికాకుండా రివిట్‌మెంట్ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వైద్యాధికారి చొరవతో ఆస్పత్రిలో అభివృద్ధి పనులు


ఆస్పత్రిప్రాంగణంలో మట్టిని లెవల్ చేయిస్తున్న డాక్టర్లు

కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుట్టేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు రోజులుగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ ఆస్పత్రి గ్రామానికి దూరంగా ఉండటంతో పాటు వసతుల కొరత ఉంది. ఆస్పత్రి ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి విషసర్పాలు, తేళ్లు లోనికి వస్తున్నాయి. స్థానిక వైద్యాధికారి వెంకటరమణ, డాక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టారు. డాక్టర్ వెంకటరమణ తన సొంత నిధులతో ప్రాంగణంలోని పిచ్చి మొక్కలకు ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించి లెవలింగ్ చేయిస్తున్నారు. అలాగే ఆస్పత్రి ప్రహరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా సిబ్బంది సహకారంతో ఆస్పత్రిలో వైద్య పరికరాలను సమకూర్చుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధికి అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది తమ సొంత నిధులు వెచ్చించి ఆదర్శంగా నిలుస్తున్నారు.



అమ్మవార్లకు పొంగళ్లు పెట్టేందుకు వెళ్తున్న గ్రామస్తులు - చిట్టేడులో మేళతాళాలతో ఊరేగుతున్న గంగపెట్టె

వైభవంగా అంకమ్మ గ్రామోత్సవం

కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న చిట్టేటమ్మ, పోలేరమ్మ, కామాక్షమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అంకమ్మ గ్రామోత్సవం జరిగింది. గ్రామస్తులు గంగపెట్టె, పోలేరమ్మ ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

వీధుల పేర్లు తెలిపేలా బోర్డుల ఏర్పాటు అభినందనీయం

గూడూరు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీధుల పేర్లను తెలిపేలా రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బోర్డులను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక రోటరీ భవన్‌లో వీధుల పేర్లు తెలిపే బోర్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలు వీధుల పేర్లు తెలుసు కునేలా రోటరీక్లబ్ సభ్యులు బోర్డులను ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, డాక్టర్ జనార్దన రెడ్డి, మునిగిరీష్, దశరధరామిరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, శ్రీధర్ రెడ్డి, జీజీ నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక


హ్యాండ్‌బాల్ జట్టుతో పీడీ శిరేష్ తదితరులు

చిల్లకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఉమ్మడి నెల్లూరు జిల్లా హ్యాండ్‌బాల్ జట్టును ఆదివారం ఎంపిక చేసినట్లు పీడీ శిరేష్ అన్నారు. ఈనెల 13,14,15 తేదీల్లో అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు జరగనున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లో సచివాలయ భవనం


సచివాలయం చుట్టూ పిచ్చి మొక్కలు

పెళ్లకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లి సచివాలయ భవనం చుట్టూ ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో సచివాలయంలోకి పాములు, విష పురుగులు వస్తున్నాయి. ఇటీవల సచివాలయంలోకి వచ్చిన ఓ పామును సిబ్బంది కొట్టి చంపారు. ఇలాంటి ఘటనలతో సచివాలయ ఉద్యోగులు, వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సచివాలయ ప్రాంగణంలో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై దృష్టి

వాకాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలపై దృష్టి సారించాలంటూ వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం వాకాడు మండలంలోని తన నివాసంలో రాంకుమార్ రెడ్డి వాకాడు, కోట మండలాల వైసీపీ నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నెల్లూరు పెంచల్‌రెడ్డి, వాకాటి రవి, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య


కోటయ్య మృతదేహం

కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెం గ్రామానికి చెందిన మల్లి కోటయ్య (55) ఆదివారం ఉరివేసుకొని మృతి చెందాడు. వెంకన్నపాళెంలోని వడ్డిపాళెం గ్రామానికి చెందిన కోటయ్య వీరారెడ్డిసత్రం సమీపంలోని ఇటుకబట్టీల దగ్గర ఉన్న మామిడితోటలో చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కొడుకు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

చదువులతోనే ఉజ్వల భవిత


సహపంక్తి భోజనం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక గాంధీనగర్ సమీపంలోని మినీగురుకులం బాలికల పాఠశాలలో టీచర్స్, పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరహా కార్యక్రమం ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను తల్లిదండ్రులు తెలుసుకునే వీలుంటుందన్నారు. అనంతరం తల్లిదండ్రులకు ముగ్గులు, క్రీడా పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. పాఠశాలలో సహపక్తి భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, రామమోహన్‌రావు, రవీంద్రబాబు, జ్యోతి, మస్తానయ్య, ఉమా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని నెల్లటూరు ప్రాథమిక పాఠశాలలో టీచర్స్, పేరెంట్స్ సమావేశాన్ని నిర్వహించారు.

కోటమ్మకు పూజలు


ప్రత్యేక అలంకారంలో కోటమ్మ

కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామ దేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మకు...

చిల్లకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

గూడూరు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోకవర్గంలో ఏర్పాటు కానున్న పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగావకశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు జనసేన నాయకులు విన్నవించారు. ఆదివారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో జనసేన నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తీగల చంద్రశేఖర్, మోహన్, భాస్కర్, బాలసుబ్రహ్మణ్యం, శివకుమార్, నవీన్, సాయికిరణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి ఆనంద్ రెడ్డి కోరారు. రైతులు ఈ నెల 15వ తేదీ లోగా ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలని సూచించారు.

రహదారికి మోక్షమెన్నడో!

చినుకు పడితే నడకా నరకమే
14 గ్రామాల ప్రజలు అవస్థ


జంగాలపల్లి వద్ద గుంతలమయంగా మారిన తారురోడ్డు

పెళ్లకూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని 71వ జాతీయ రహదారిలోని గుర్రప్పతోట నుంచి కప్పగుంటకండ్రిగ మీదుగా పాలచ్చూరు గిరిజన కాలనీ వరకు ఉన్న రోడ్డుకు మోక్షం లభించక 14 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. సుమారు 10 కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డుపై తారు లేచిపోయి మట్టిరోడ్డుగా మారింది. అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా మారడంతో దారిలో నడకకే నరకం మారింది. ఎన్నో ఏళ్లుగా మరమ్మతులు చేపట్టక పోవడంతో రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే ఒళ్లు గుల్లవుతోందని ప్రజలు వాపోతున్నారు. వాహనాల్లో వెళ్లినా గోతుల్లో పడి ప్రమాదాలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేనకూరు సెజ్‌తో పాటు కప్పగుంటకండ్రిగ, జంగాలపల్లి, పెరుమాళ్లపల్లి, అనకవోలు, పాలచ్చూరు తదితర 14 గ్రామాలకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తదితర వాహనాల్లో వందలాది మంది కార్మికులు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గుర్రప్పతోట నుంచి కప్పగుంటకండ్రిగ రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సునీత అన్నారు. నాయుడుపేట పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ఆ సంఘ రాష్ట్ర నాయకులతో కలసి సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాన్ని గిట్టుబాటు కానీవ్వకుండా చేసిన పాలకుల విధానాలే వ్యవసాయ రంగ సంక్షోభానికి కారణమన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల తయారీని విదేశీ బహుళజాతి కంపెనీలకు కట్టపెట్టడం వల్లే పెట్టుబడులు పెరిగి రైతాంగానికి గిట్టుబాటు కాకుండా పోయిందన్నారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని గత మూడేళ్లుగా రైతాంగం ఆందోళన చేస్తున్నా.. మొండి వైఖరితో వ్యవహరిస్తుండటాన్ని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ నాయకుడు లక్ష్మీరెడ్డి, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణయ్య, సుబ్బరాయుడు, జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, రవీంద్ర, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారిని కమ్మేసిన కంపచెట్లు

తరచూ ప్రమాదాలు


చెంబేడు చెరువుకట్ట వద్ద రోడ్డుమీదకు వచ్చిన కంపచెట్లు

పెళ్లకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబేడు నుంచి శ్రీకాళహస్తి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా కంపచెట్లు, ముళ్ల పొదలు పెరిగిపోయాయి. ముళ్ల కంపలు రోడ్డు మీదకు రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అదేవిధంగా చెంబేడు నుంచి ఆర్లపాడు గ్రామానికి వెళ్లే దారిలో ఏర్పాటుచేసిన ఆర్లపాడు సూచిక బోర్డును కంపచెట్లు కమ్మేశాయి. అధికారులు స్పందించి కంపచెట్లు తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

అయ్యప్పజ్యోతి మహోత్సవంలో అన్నదానం



నాయుడుపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని అయ్యప్ప స్వామి అఖండజ్యోతి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం అయ్యప్పస్వాములకు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జలదంకి వెంకటకృష్ణారెడ్డి, పెనల కిషోర్‌బాబు, చిరువెళ్ల మునిరాజ, విజియల్ రెడ్డి, జలందర్, చిట్టేటి అంకయ్య, పెనల రమేష్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ కౌంటర్లో అదనపు ఈవో తనిఖీలు

తిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని లడ్డూ కౌంటర్‌లో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. టోకెన్ల స్కానింగ్‌తో పాటు భక్తులకు లడ్డూలు జారీచేసే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. కొందరు భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు సేకరించారు. లడ్డూలు ఎలా ఉన్నాయి.. వాటిని పొందే ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. లడ్డూల రుచి, నాణ్యత పెరగడంపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.